

2024 ఎన్నికల ఘోర పరాభవం
2026 స్థానిక ఎన్నికల్లోనూ తప్పదనే
భయంతో వైసీపీ కోర్టులను
ఆశ్రయించి ఎన్నికలను వాయిదా
వేయించేందుకు కుట్రలు చేస్తోంది.
జగన్ ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజలు
తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ


శనివారం 10.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 170 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# భూమి రైతుదే.. హక్కు రైతుదే!



ప్రకాశం, అక్టోబర్ 9(జర్నలిస్ట్ ఫైల్): రైతు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలి తప్ప.. అర్జీలు పట్టుకుని అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూమి రైతుదేనని, ఆ భూమిపై హక్కు కూడా రైతుదేనని, ఆ హక్కును కాపాడే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతుల భూ హక్కులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు.

కొండపి నియోజకవర్గంలోని నరసింగోలులో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. భూ సమస్యలను పరిష్కరించి రైతులకు హక్కు పత్రాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు 40 లక్షల 58 వేల పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు చంద్రబాబు తెలిపారు. అక్టోబర్ నెలలోనే 793 గ్రామాల్లో 4 లక్షల 58 వేల మందికి పాస్‌పుస్తకాలు అందించామని చెప్పారు. ఒక్క ప్రకాశం జిల్లాలోనే 24,116 పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పాస్‌పుస్తకాల పంపిణీని వేగవంతం చేసేందుకు అధికారులకు లక్ష్యాలను నిర్దేశించామని, నిర్ణీత లక్ష్యాలను పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ వివాదాలకు కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి విమర్శించారు. భూ ఆక్రమణలు, కబ్జాలు, వివాదాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. రైతుల భూములకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలోనే అనేక సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. గతంలో ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాలను పరిశీలిస్తే, తమ ఆస్తిపై తమ ఫొటోకు బదులుగా మరొకరి ఫొటో కనిపించే పరిస్థితులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసినట్లు చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను రైతులకు అందిస్తోందన్నారు. భూమిపై హక్కు రైతుదేనని, ఆ హక్కును ఎవరూ ప్రశ్నించలేని విధంగా భూ రికార్డులను పటిష్టం చేస్తున్నామని చెప్పారు.

మిగతా 2లో...



- కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలకు చెక్
- రాష్ట్రవ్యాప్తంగా 40.58 లక్షల మందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు
- 'మీ భూమి-మీ హక్కు'తో భూ రికార్డుల పటిష్టీకరణ
- హక్కు పత్రాల పంపిణీలో కొత్త రికార్డు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



## చెస్ అకాడమీకి సహకరించండి

- మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేసిన ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి, తండ్రి అశోక్ శుక్రవారం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్-2026 మహిళల విభాగంలో భారత జట్టు కాంస్య పతకం, వ్యక్తిగత విభాగంలో కోనేరు హంపి బోర్డు-1లో కాంస్య పతకం కైవసం చేసుకోవడం పట్ల మంత్రి అభినందనలు తెలిపారు. అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున మద్దతుగా నిలవాలని కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి.. ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## బీసీ రిజర్వేషన్లకు సుప్రీం చెక్

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల జీవోలు రద్దు
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటేందుకు వీల్లేదన్న ధర్మాసనం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై కొనసాగనున్న ఉత్కంఠ

న్యూఢిల్లీ, అక్టోబర్ 9(జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోల విషయంలో సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవోలను రద్దు చేస్తూ గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించిన ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ప్రత్యేక అనుమతి పిటిషన్‌ను కొట్టివేసింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు.

మిగతా 2లో...



## బీసీ రిజర్వేషన్లపై.. నేడు కీలక భేటీ

- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అత్యవసర కేబినెట్ సమావేశం
- రాజీవ్ రంజన్ కమిషన్ నివేదికపై మంత్రివర్గంలో చర్చ
- బీసీలకు విస్తృత రాజకీయ ప్రాతినిధ్యంపై కసరత్తు
- ఎస్సీ, ఎస్టీల హక్కులకు భంగం కలగకుండా కార్యాచరణ

## కాఫీతో కాసుల పంట

- ప్రాసెసింగ్‌తో రైతులకు మెరుగైన ధర
- 1,000 బేబీ పల్పర్ల పంపిణీకి చర్యలు
- రూ.1.30 కోట్లతో 200 ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం
- ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి

3లో

## విదేశీ విద్యకు దివ్యాంగులకు చేయూత

- డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఉన్నత విద్య కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'జాతీయ విదేశీ విద్యా ఉపకార వేతనం' ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు మరియు సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

భారత ప్రభుత్వ సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన దివ్యాంగుల సాధికారత విభాగం

మిగతా 3లో...

## అటవీ హక్కుల అమలులో.. ఏపీ భేష్

- కోల్‌కతా ప్రాంతీయ సదస్సులో ఏపీ ప్రజెంటేషన్‌కు అభినందనలు

3లో



## తాగునీటిని మళ్లిస్తే కఠిన చర్యలు

- చేపలు, రొయ్యల చెరువులకు మంచినీటి మళ్లింపుపై నిఘా
- తాగునీటి చౌర్యానికి పాల్పడితే అరెస్టు చేయించాలి
- ఆరు నెలల పాటు సరఫరాపై నిరంతర పర్యవేక్షణ
- పట్టణాలు, గ్రామాల్లో నీటి కొరత రాకుండా చర్యలు
- జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 9 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం, పట్టణ గ్రామీణ తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఏపీ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ అంశాలపై సమీక్షించి, పలు సూచనలు చేశారు.మంచి నీటిని తాగునీటేతర అవసరాలకు అనగా చేపలు, రొయ్యల చెరువులకు మళ్ళించి కుండా చూడాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.ఎక్కడైనా ఎవరైనా తాగునీటి చౌర్యానికి పాల్పడితే వారిని వెంటనే అరెస్టు చేయించాలని ఆదేశించారు.

మిగతా 2లో...



## జనగణనలో.. పక్కా లెక్కలు!



- జనగణన-2027 రెండో దశను ఖచ్చితత్వంతో పూర్తి చేయాలి
- ప్రతి కుటుంబం.. ప్రతి వ్యక్తి గణనలోకి రావాలి
- అధికారులకు భారత జనగణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఆదేశాలు

3లో

## ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయం



- డేటాలేక్ చాలా బాగుంది
- రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్ ప్రశంసలు

3లో

## దుర్గా మండపాలకు ఉచిత విద్యుత్

- ఈ నెల 11 నుంచి 20 వరకు సరఫరా
- గ్రామాల్లో 3 కిలోవాట్లు.. పట్టణాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచితం
- విద్యుత్ భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- మండపాల నిర్వాహకులకు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచనలు

2లో



## జాతీయ భద్రతే ప్రథమం



- స్టార్‌లింక్ సహా అన్ని సంస్థల అనుమతుల్లో కఠిన నిబంధనలు
- బీజేపీ ఏపీ మీడియా ఇన్‌చార్జ్ దిలీప్ కిలారు

న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్): ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలకు అనుమతులు ఇచ్చే విషయంలో జాతీయ భద్రత, డిజిటల్ సార్వభౌమత్వం, వ్యూహాత్మక ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ డాక్టర్ దిలీప్ కిలారు అన్నారు.

మిగతా 2లో...

# బీసీ రిజర్వేషన్లకు సుప్రీం చెక్



(మొదటి పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని మించుతున్నాయని పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించాయి.

ఈ పిటిషన్లను విచారించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో 50 శాతం పరిమితిని దాటి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని పేర్కొంటూ ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోలను రద్దు చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ప్రత్యేక అనుమతి పిటిషన్ దాఖలు చేసింది.

**ఎంపిరికల్ డేటాపై ప్రభుత్వ వాదన :** సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు క్షేత్రస్థాయి పరిస్థితులు, జనాభా వివరాలు, ఎంపిరికల్ డేటాను పరిగణనలోకి తీసుకున్నామని వాదించారు. రాష్ట్రంలోని సామాజిక, జనాభా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు నిర్ణయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

అయితే రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగపరమైన పరిమితులు, సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన 50 శాతం గరిష్ట పరిమితి అంశాన్ని ధర్మాసనం పరిశీలించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన జీవోలపై ప్రస్తుతం హైకోర్టు తీర్పే అమల్లో ఉండనుంది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయం నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

**50 శాతం పరిమితిపైనే ప్రధాన వివాదం :** బీసీ రిజర్వేషన్ల అంశంలో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని మించుతున్నాయా లేదా అన్నదే న్యాయపరమైన వివాదానికి కేంద్రంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 34 శాతం కోటాను ప్రతిపాదించగా, ఇతర రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని దాటుతున్నాయని పిటిషనర్ల వాదన.

ఈ అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా సమర్థించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కొత్త పరిస్థితి ఏర్పడింది. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం తదుపరి ఎలాంటి న్యాయ, పరిపాలనా చర్యలు చేపడుతుందనేది ఇప్పుడు కీలకంగా మారింది.

## బీసీ రిజర్వేషన్లపై.. నేడు కీలక భేటీ

**అమరావతి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయంగా న్యాయం జరిగేలా రాజ్యాంగం, చట్టాల పరిధిలో అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవిస్తుందని స్పష్టం చేస్తూనే, బీసీలకు సాధ్యమైనంత విస్తృతమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా పాటిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని వర్గాల హక్కులను పరిరక్షిస్తూ సమతుల్యమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

బీసీ రిజర్వేషన్లపై తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు శనివారం అత్యవసర కేబినెట్ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమావేశంలో రాజీవ్ రంజన్ ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ముందుంచి చర్చించనున్నారు. కమిషన్ నివేదికతో పాటు సుప్రీంకోర్టు తీర్పు, రాజ్యాంగపరమైన నిబంధనలు, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు తెలిపారు.

**34 శాతానికి మించి ప్రాతినిధ్యం :** బీసీల రాజకీయ సాధికారతకు చట్టబద్ధమైన, దీర్ఘకాలిక పరిష్కారం కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసిందన్నారు. చట్టపరమైన పరిమితులు ఉన్నప్పటికీ, రాజకీయంగా బీసీలకు 34 శాతానికి మించి ప్రాతినిధ్యం కల్పించి న్యాయం చేస్తామని గతంలోనే ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

బీసీ రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం చట్టపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, అన్ని రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది కార్యాచరణను నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై కూడా ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాంగ హక్కులను పరిరక్షించేలా తదుపరి చర్యలు ఉంటాయని చంద్రబాబు స్పష్టం చేశారు. కేబినెట్ సమావేశంలో సమగ్ర చర్చ అనంతరం ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెల్లడించనుంది.

## చట్టపరంగా అమలు చేయలేం



**అమరావతి, అక్టోబర్ 9, (జర్నలిస్ట్ ఫైల్):** చట్టపరంగా బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అవకాశం లేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ పరంగా 34 శాతానికి పైగా టికెట్లు కేటాయించి బిసిలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో రిజర్వేషన్ల అమలుకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, రాజకీయంగా న్యాయం చేసే విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తెలిపారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలను వైసిపి అడ్డుకొని వారి రాజకీయ ప్రాతినిధ్యానికి విఘాతం కలిగించారని విమర్శించారు. బిసిలకు సముచిత స్థానం కల్పించింది టిడిపి అని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నారు. బిసి రిజర్వేషన్లపై వైసిపి విధానం ఏమిటో చెప్పాలని టిడిపి ఎమ్మెల్యే గల్లా మాధవి, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు వేర్వేరు సమావేశాల్లో ప్రశ్నించారు.

# భూమి రైతుదే.. హక్కు రైతుదే!

(మొదటి పేజీ తరువాయి)

భూమి కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం :** కొండపి నియోజకవర్గ ప్రజలకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.166 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. రెండేళ్లలో రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ పూర్తయితే సుమారు 9,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. 15 గ్రామాలకు చెందిన సుమారు 30 వేల మందికి తాగునీటి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. రిజర్వాయర్లు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల విషయంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. ప్రజల డబ్బుతో చేపట్టే ప్రతి నిర్మాణం నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

**రూ.27.85 కోట్లతో బ్రిడ్జి :** నరసింగోలు పర్యటనలో భాగంగా ముప్పాళ్ల వద్ద రూ.27.85 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అదే సమయంలో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ స్పిల్‌వే, ప్రధాన తూముల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతంలో సాగునీరు, తాగునీటి



సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు విస్తరించనున్నాయని తెలిపారు.

ప్రకాశం జిల్లాలో దశాబ్దాలుగా పరిష్కారం కాని గర్భ కంద్రిక భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని చంద్రబాబు చెప్పారు. భూములకు సంబంధించిన హక్కు పత్రాలను రైతులకు అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, రైతులకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.

**చెడు ప్రోత్సహించకూడదు :** దీపావళి సందర్భంగా చెడుపై మంచి సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు. నరకాసుర వధకు ప్రతీకగా దీపావళిని జరుపుకుంటున్నామని చెప్పారు. సమాజంలో చెడును ప్రోత్సహించకుండా మంచి చేసే వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మంచి పాలన, ప్రజల భద్రత, ఆస్తుల రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసకర పరిస్థితులు నెలకొన్నాయని చంద్రబాబు విమర్శించారు. ప్రజలకు తమ ఇళ్లు, ఆస్తులు, భూముల విషయంలో భద్రతపై ఆందోళన ఉండేదని అన్నారు. ముఖ్యమంత్రి పదవి తనకు కొత్త కాకపోయినా, గత ప్రభుత్వ పాలన కారణంగా ఏర్పడిన అనేక సమస్యలు తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడనివిగా ఉన్నాయని వ్యాఖ్యానించారు.

**రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం :** ప్రధాని నరేంద్ర మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చంద్రబాబు తెలిపారు. తనకు పరిపాలనా అనుభవం, పవన్ కల్యాణ్‌కు ప్రజల కోసం పనిచేయాలనే తపన, ప్రధాని మోదీ అండగా ఉన్నాయని చెప్పారు. ఈ మూడు శక్తులతో ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించేందుకు ముందుకు సాగుతున్నామని తెలిపారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని, ట్రిబుల్ బుల్లెట్ స్పీడ్‌తో పనులు చేపడుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోదీతో పాటు ఎనిమిది మంది కేంద్ర మంత్రులను కలిసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంలో తనకు ఎలాంటి భేషజాలు లేవని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన నిధులు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలను సాధించేందుకు ఎవరినైనా కలవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణం, రైతుల సంక్షేమం, భూ హక్కుల పరిరక్షణ, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# తాగునీటిని మళ్లిస్తే కఠిన చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

రానున్న ఆరు మాసాలు తాగునీటి సరఫరా ప్రత్యేక దృష్టి సారించాలని సిఎస్ సాయి ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు.

రాష్ట్రంలో అక్టోబర్ 8 నాటికి సాధారణ వర్షపాతం కంటే 38.9 శాతం లోటు నమోదైందని, 21 జిల్లాల్లోని 388 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో పంట నష్టం అంచనాలను ఈ నెల 17లోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు, విత్తనాల పంపిణీ, ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగును ప్రోత్సహించాలని, రైతులకు ప్రభుత్వ మద్దతు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపగ్రహ ఆధారిత పంట ఆరోగ్య హెచ్చరికలను క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిశీలించి,పెండింగ్ వివరాలను పూర్తి చేయాలన్నారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయడం, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా, బోర్ల మరమ్మతులు, నీటి వనరుల సంరక్షణ, లీకేజీల నివారణ చేపట్టాలని సూచించారు. 2027 వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లా స్థాయిలో పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఉద్యాన పంటల పరిరక్షణకు సూక్ష్మ సేద్యం, వ్యవసాయ కుంటలు, సేంద్రియ మల్చింగ్, అవసరమైన రైతులకు అత్యవసర నీటి సరఫరా వంటి చర్యలను వేగవంతం చేయాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ పట్టణ ప్రాంతాల్లో తాగునీటి పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ పట్టణ స్థానిక సంస్థల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమీషనర్లను ఆదేశించామని వివరించారు.23 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేక సమ్మర్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా తాగునీటిని వృథా చేయకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. రానున్న ఆరు మాసాల్లో ఎక్కడా తాగునీరు అందలేదని ఫిర్యాదులు రాకుండా చూడాలని చెప్పారు.

రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై ప్రెజెంటేషన్ ఇస్తూ ఎల్నినో వల్ల రాష్ట్రంలో 514 మండలాలు ప్రభావితం కాగా ఇప్పటికే 388 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని తెలిపారు.తాగునీటి ఎద్దడి అధికంగా ఉండే మండలాల్లో ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు.

ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజతో పాటు జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## దుర్గా మండపాలకు ఉచిత విద్యుత్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విజయదశమి పండుగ సందర్భంగా దుర్గాదేవి మండపాలకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్లు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

అనుమతి పొందిన దుర్గా మండపాల నిర్వాహకులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్దేశించిన పరిమితికి మించి విద్యుత్ లోడ్ అవసరమైతే సాధారణ తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

**మండపాల వద్ద విద్యుత్ భద్రతకు ప్రాధాన్యం :** దుర్గా మండపాలకు విద్యుత్ సరఫరా చేసే ముందు అధికారులు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సీఎండీ ఆదేశించారు. పండుగ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా మండపాలను ఏర్పాటు చేయాలని, మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ అలంకరణల కోసం నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లను మాత్రమే వినియోగించాలని తెలిపారు. విద్యుత్ కనెక్షన్లు, అలంకరణల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.

ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటిని తాకకుండా, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. అటువంటి పరిస్థితులు ఎదురైతే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సీఎండీ పి. పుల్లారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి పటిష్ట కార్యాచరణ:మంత్రి కందుల దుర్గేష్

- **జనసేన పార్టీ ఏర్పాటు చేసిన కమిటీల సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్**




**అమరావతి, అక్టోబర్ 9, (జర్నలిస్ట్ ఫైల్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 25 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ ఉ మార్గదర్శక కమిటీ, కూటమి సమన్వయ కమిటీ, ప్రచార కమిటీ, మరియు ట్రెజరీ కమిటీల సభ్యులుగా ఎన్నికైన నాయకులందరికీ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... జనసేనాని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి సమాచార సేకరణ, ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. డిప్యూటీ సీఎం క్షుణ్ణంగా పరిశీలించి ప్రకటించిన ఈ కమిటీల సభ్యులపై అత్యంత కీలకమైన బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జనసేనాని ఆశయాలకు అనుగుణంగా కమిటీ సభ్యులందరూ తమ పనితీరును ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపిక మొదలుకొని, ప్రచార పర్వం ముగిసే వరకు ప్రతి దశను అత్యంత వ్యూహాత్మకంగా నిర్విఘ్నంగా పూర్తి చేయాలన్నారు. అభ్యర్థులను విజయతీరాలకు చేర్చే గురుతర బాధ్యత మన అందరిపై ఉందని, పార్టీ శ్రేణులన్నీ సమైక్యంగా కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యమని దిశానిర్దేశం చేశారు.

తనను ప్రచార కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, ఇదే సమయంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన తోటి సభ్యులందరికీ మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ త్రికరణశుద్ధితో పని చేసేందుకు సంసిద్ధంగా ఉండాలని కోరారు. నేటి నుండే ఎన్నికల రణక్షేత్రంలోకి దిగి అభ్యర్థులను గెలిపించేంతవరకు శ్రమించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో ఎన్నికల సంఘం నుండి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అనుమతితో సమర్థవంతమైన ప్రచార కార్యాచరణను రూపొందించుకుని ముందుకు వెళ్దామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్పెయిన్ పర్యటనలో ఉన్న మంత్రి దుర్గేష్ వీడియో సందేశం ద్వారా జనసైనికులు, వీర మహిళలు అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

## డ్రైవర్ జెట్టి శివ త్యాగం చిరస్మరణీయం



**తాడేపల్లి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** అనకాపల్లి జిల్లాలో విధి నిర్వహణలో గుండెపోటుకు గురైనప్పటికీ, చివరి క్షణాల్లో బస్సును సురక్షితంగా నిలిపి 40 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ జెట్టి శివ త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శివ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.

తీవ్ర అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితుల్లోనూ ప్రయాణికుల భద్రతకే ప్రాధాన్యతనిచ్చిన శివ విధి నిర్వహణ పట్ల అంకితభావం, మానవత్వానికి నిదర్శనమని మంత్రి కొనియాడారు. తన ప్రాణాలను పణంగా పెట్టి 40 కుటుంబాల్లో విషాదం చోటుచేసుకోకుండా కాపాడిన ఆయన సేవాస్ఫూర్తి ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

జెట్టి శివ కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో ప్రభుత్వం, ఏపీఎస్ఆర్టీసీ కుటుంబానికి అండగా నిలిచి నిబంధనల ప్రకారం తగిన సహాయ సహకారాలు అందించాలని అధికారులను కోరారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినా 40 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన శివ త్యాగం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.

## జాతీయ భద్రతే ప్రథమం



(మొదటి పేజీ తరువాయి)

స్టార్‌లింక్ సహా అన్ని సంస్థలకు అనుమతుల ప్రక్రియలో భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు.

ఉపగ్రహ సాంకేతికత ద్వారా మారుమూల గ్రామాలు, సరిహద్దు ప్రాంతాలు, దీవులకు మెరుగైన కనెక్టివిటీ అందించే అవకాశం ఉందని తెలిపారు. అయితే విదేశీ నియంత్రణలోని ఉపగ్రహ వ్యవస్థలు, డేటా భద్రత, చట్టబద్ధమైన సమాచార పర్యవేక్షణ, అత్యవసర పరిస్థితుల్లో నియంత్రణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని అన్నారు.

ప్రతి సంస్థకు గేట్‌వే మౌలిక వసతులు, డేటా స్థానికీకరణ, చట్టబద్ధమైన సమాచార పర్యవేక్షణ, పారదర్శకత, జాతీయ భద్రతా ఆదేశాల అమలుపై స్వతంత్ర సాంకేతిక పరిశీలన నిర్వహించాలని సూచించారు. ఉపగ్రహ బ్రాడ్‌బ్యాండ్ సేవలు విపత్తుల సమయంలో కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీని విస్తరించగలవని పేర్కొన్నారు.

స్టార్‌లింక్‌తో పాటు భారతి ఆధారిత యూటెల్‌సాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ వంటి సంస్థలను కూడా ఒకే విధమైన నియంత్రణ ప్రమాణాల ప్రకారం పరిశీలించాలని దిలీప్ కిలారు అన్నారు. అంతర్జాతీయ ప్రభావం లేదా వాణిజ్య ప్రయోజనాల ఆధారంగా ఏ సంస్థకూ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకూడదని, నిబంధనలు పూర్తి చేసిన సంస్థలకు నిర్ణీత కాలపరిమితిలో అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

భారత్ విదేశీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికతలకు స్వాగతం పలుకుతూనే స్వదేశీ ఉపగ్రహ కమ్యూనికేషన్ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాలని అన్నారు. స్పెక్ట్రమ్ కేటాయింపు, విదేశీ పెట్టుబడులు, భద్రతా ప్రమాణాల విషయంలో స్పష్టమైన విధానంతో ముందుకు సాగాలని, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తూనే జాతీయ భద్రత, డిజిటల్ సార్వభౌమత్వం విషయంలో రాజీ ఉండకూడదని దిలీప్ కిలారు స్పష్టం చేశారు.

# కాఫీతో కాసుల పంట

**పాడేరు, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్):** కాఫీ పంటలో ప్రాథమిక స్థాయిలోనే విలువ ఆధారిత ప్రక్రియలు చేపట్టడం ద్వారా రైతులు మెరుగైన ధర పొందవచ్చని ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తెలిపారు. కాఫీ చెర్రీలను బేబీ పల్వర్లతో ప్రాసెసింగ్ చేసి పార్చ్‌మెంట్‌గా మార్చడం ద్వారా ఉత్పత్తి విలువ పెంచుకోవచ్చని సూచించారు.

ఏపీఎఫ్‌పీఎస్, కాఫీ బోర్డు సమన్వయంతో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద 2026–27లో అర్హులైన కాఫీ రైతులకు 1,000 బేబీ పల్వర్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ. 1.30 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో 200 కాఫీ పార్చ్‌మెంట్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు. దీనివల్ల స్థానికంగా విలువను నిలుపుకోవడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

పాడేరులో కాఫీ బోర్డు, ఏపీఎఫ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులతో అధికారులు చర్చించారు. ప్రాసెసింగ్, మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులకు సంబంధించిన సమస్యలను రైతులు వివరించారు. కాఫీ బోర్డు, ఏపీఎఫ్‌పీఎస్, బ్యాంకింగ్ సంస్థలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో కాఫీ క్లస్టర్‌ను బలోపేతం చేసి రైతులకు స్థిరమైన, మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

# విదేశీ విద్యకు దివ్యాంగులకు చేయూత

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా బెంచ్‌మార్క్ దివ్యాంగుల కోసం ఈ జాతీయ విదేశీ విద్యా ఉపకార వేతన పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిష్టాత్మక విదేశీ విశ్వవిద్యాలయాలు మరియు విద్యాసంస్థల్లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సులను అభ్యసించేందుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు.

ఈ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మాస్టర్స్ డిగ్రీ కోసం సంబంధిత బ్యాచిలర్ డిగ్రీలో, అలాగే పీహెచ్‌డీ కోసం సంబంధిత మాస్టర్స్ డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులు లేదా సమానమైన గ్రేడ్ సాధించి ఉండాలని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు పథక మార్గదర్శకాలకు అనుగుణంగా ట్యూషన్ ఫీజు, నిర్వహణ భత్యం, అనుబంధ/కాంటింజెన్సీ భత్యం, విమాన ప్రయాణ ఖర్చులు, వీసా రుసుము, వైద్య బీమా వంటి ఖర్చులకు ఆర్థిక సహాయం లభిస్తుందని తెలిపారు.

అర్హత కలిగిన బెంచ్‌మార్క్ దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచిస్తూ, పథకానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు మరియు ఇతర వివరాల కోసం కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ https://depwd.gov.in/ ను సందర్శించాలని ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

# అటవీ హక్కుల అమలులో.. ఏపీ భేష్




**కోల్‌కతా (జర్నలిస్ట్ ఫైల్) :** అటవీ హక్కుల చట్టం–2006 అమలులో ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. కోల్‌కతాలో నిర్వహించిన రీజనల్ కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్. భార్గవి రాష్ట్రంలో అమలవుతున్న వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అటవీ హక్కుల రికార్డులను గిరిభూమి పోర్టల్ ద్వారా డిజిటల్ విధానంలో నిర్వహిస్తూ, రెవెన్యూ శాఖ మీభూమి పోర్టల్, బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానం చేయడం వంటి చర్యలను వివరించారు. అటవీ హక్కుల లబ్ధిదారులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా శాఖల మధ్య సమన్వయం, సామాజిక అటవీ వనరుల హక్కుల గుర్తింపు, గిరిజనుల జీవనోపాధుల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు.

అటవీ ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడంతో పాటు గిరిజనుల హక్కుల పరిరక్షణ, సామాజిక–ఆర్థిక అభివృద్ధికి ఏపీ అనుసరిస్తున్న విధానాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని సమావేశ ప్రతినిధులు అభినందించారు. ఈ ఉత్తమ విధానాల ద్వారా అటవీ హక్కుల చట్టం లక్ష్యాలను మరింత సమర్థవంతంగా సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# జనగణనలో.. పక్కా లెక్కలు!




**అమరావతి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** జనగణన–2027 రెండో దశ అయిన జనాభా గణనను ఖచ్చితత్వం, నాణ్యత, సమయపాలనతో పూర్తి చేయాలని భారత రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి జనగణన పరిధిలోకి వచ్చేలా పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి దశ గృహాల జాబితా, గృహ గణన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను అభినందించారు. రెండో దశలో 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళి ద్వారా ప్రతి వ్యక్తి జనాభా వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. మతం, కులం, దివ్యాంగత్వం, వృత్తి వంటి అంశాలపై ప్రజల భావాలను గౌరవిస్తూ ఖచ్చితమైన సమాచారం సేకరించాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రజలు స్వీయ గణన సదుపాయాన్ని వినియోగించుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మూడు అంచెల శిక్షణ అందించాలని ఆదేశించారు. డిజిటల్ విధానంలో మొబైల్ అప్లికేషన్లు, సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్‌ను వినియోగించనున్నట్లు తెలిపారు. 55 రోజుల గడువులో పనులు పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు రోజువారీ సమీక్షలు, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ సూచించారు. రాష్ట్ర నోడల్ అధికారి శంషేర్ సింగ్ రావత్, జనగణన కార్యకలాపాల సంచాలకులు జె. నివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళలకు 'హోమ్ ఆయా' శిక్షణ

- **స్వగ్రామాల్లోనే గౌరవప్రదమైన ఉపాధి**
- **వలసలకు స్వస్తి..**
- **కేర్ ఎకానమీ ద్వారా పొదుపు సంఘాల మహిళలకు స్థిరమైన ఆదాయం**
- **మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**అమరావతి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంత మహిళలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరం లేకుండా, వారి స్వగ్రామాలకు సమీపంలోనే గౌరవప్రదమైన జీవనోపాధి మరియు స్థిరమైన ఆదాయం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న 'కేర్ ఎకానమీ' రంగంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో 'హోమ్ ఆయా – జెరియాట్రిక్ కేర్ టేకర్' అనే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థల ద్వారా ఉచితంగా వసతి సదుపాయంతో శిక్షణ ఇస్తారని మంత్రి తెలిపారు.

ఇందులో భాగంగా వయోవృద్ధులు, శయ్యాగత రోగుల సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, ప్రథమ చికిత్స మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలపై ప్రత్యక్ష శిక్షణతో పాటు వృద్ధాశ్రమాలు, నర్సింగ్ హోమ్‌లు, శిశు సంరక్షణ కేంద్రాలను సందర్శింపజేసి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని మంత్రి తెలిపారు. అలాగే బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక నిర్వహణపై మహిళలకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తారని.. జిల్లాలోని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు ఆసక్తి ఉన్న స్వయం సహాయక మహిళలను గుర్తించి వారికి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థల ద్వారా శిక్షణ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఈ శిక్షణా కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేయనున్నామని.. గ్రామీణ మహిళలు ఈ అవకాశంతో నైపుణ్యాలు పెంచుకుని.. స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయాలని మంత్రి కొండపల్లి పిలుపునిచ్చారు.

# రవాణా శాఖ సేవల్లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- **వాహన్, సారథి పోర్టల్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్**
- **ప్రజల ఫిర్యాదుల స్వీకరణకు 24 గంటల సేవలు**
- **రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అమరావతి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** వాహన్, సారథి పారివాహన్ పోర్టల్ల ద్వారా రవాణా శాఖ సేవలు పొందుతున్న ప్రజలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

వాహన యాజమాన్య బదిలీ, డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, ఆధార్ వివరాల సరిపోలిక, హెచ్ఎస్ఆర్‌పీ వివరాల నమోదు, సర్వర్ నెమ్మదిగా పనిచేయడం తదితర సమస్యలను పరిష్కరించేందుకు జాతీయ సమాచార కేంద్రం, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖతో సమన్వయం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

**ఫిర్యాదుల కోసం 24 గంటల కంట్రోల్ రూమ్ :** ప్రజల సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజలు ఫోన్ కాల్ లేదా వాట్సాప్ సందేశం ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

**కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 9281607001**

వాహన యాజమాన్య బదిలీ సమయంలో సంబంధిత ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని ఎంపిక చేసుకోవడంలో ఎదురైన సమస్య పరిష్కరించామని తెలిపారు. ఆధార్ వివరాలు డ్రైవింగ్ లైసెన్స్ వివరాలతో సరిపోలని వారు అవసరమైన ఇతర పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి లైసెన్స్ పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

వాహనాల ఫిట్‌నెస్ ప్రక్రియలో హెచ్ఎస్ఆర్‌పీ వివరాలు వాహన్ పోర్టల్‌లో కనిపించని పాత వాహనాల యజమానులు సంబంధిత ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని సంప్రదించి వివరాలను నవీకరించుకోవాలని సూచించారు. కొత్తగా హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్లు అమర్చాల్సిన వాహనదారులు సంబంధిత వాహన తయారీ సంస్థకు చెందిన అధీకృత డీలర్‌ను సంప్రదించాలని తెలిపారు.

**ఇంటి నుంచే లెర్నర్స్ లైసెన్స్ పరీక్ష :** ప్రజలకు మరింత సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు సెప్టెంబర్ 27 నుంచి ఇంటి నుంచే లెర్నర్స్ లైసెన్స్ పరీక్ష రాసే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి తెలిపారు. అక్టోబర్ 8 నాటికి ఈ సదుపాయం ద్వారా 2,620 మంది పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని, 138 మంది ఉత్తీర్ణులు కాలేదని వెల్లడించారు.

రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సాంకేతిక సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# తమిళ మూలాలున్న దక్షిణాఫ్రికా మహిళకు శాంతి పురస్కారం



**స్టాక్‌హోమ్:** ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం భారత్ మూలాలున్న దక్షిణాఫ్రికా వాసి నవనీతమ్ 'నవీ' పిళ్లైను వరించింది. నార్వే రాజధాని ఓస్లోలో నోబెల్ కమిటీ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. అంతర్జాతీయ న్యాయం, శాంతిని పెంపొందించేందుకు నవీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. మానవ హక్కుల కోసం ఆమె విశేష కృషి చేశారని నోబెల్ కమిటీ కొనియాడింది.

**నోబెల్ శాంతి పురస్కారం కోసం నోబెల్ కమిటీకి 287 నామినేషన్లు:** ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం కోసం నోబెల్ కమిటీకి 287 నామినేషన్లు అందాయి. సూడాన్‌లోని ఎమర్జెన్సీ బృందాలు, ఉక్రెయిన్‌లోని పిల్లల హక్కుల కార్యకర్తలు, రెండు అంతర్జాతీయ న్యాయస్థానాలతో పాటు కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఈ అవార్డు రేసులో నిలిచారు. శాంతి స్థాపన, సోదరభావాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాల కోసం విశేష కృషి చేసిన నవీ పిళ్లై వైపే నోబెల్ కమిటీ మొగ్గుచూపింది. మరింత శాంతియుత ప్రపంచానికి అంతర్జాతీయ చట్టం ఓ పునాది అని, ప్రస్తుతం అనేక సంఘర్షణలు, సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ఇది అత్యంత అవసరమని అభిప్రాయపడింది."అసాధారణ ధైర్యం, నిజాయితీతో సమగ్రమైన ప్రపంచ న్యాయ వ్యవస్థకు మార్గం చూపిన వ్యక్తికి 2026 నోబెల్ శాంతి బహుమతి లభించింది. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలు, జాతి నిర్మూలనపై విచారణ జరిగేలా చూడటంలో నవీ పిళ్లై కీలక పాత్ర పోషించారు. శాంతి, అంతర్జాతీయ చట్టాన్ని ప్రోత్సహించడానికి చేసిన కృషికి గాను ఆమెకు 2026 నోబెల్ శాంతి బహుమతిని ప్రదానం చేస్తున్నాం. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో వర్ణవివక్ష పాలనలో భారతీయ తమిళ మూలాలున్న కుటుంబంలో జన్మించిన పిళ్ళై, లోతైన వ్యవస్థాగత వివక్ష, వేర్పాటు, బహిష్కరణను ఎదుర్కొంటూ న్యాయవాదిగా, న్యాయరంగ మార్గదర్శకురాలిగా ఎదిగారు." అని నోబెల్ కమిటీ పేర్కొంది.

# రెండో టి20లో టీమిండియా ఓటమి




**రాంచీ:** కెప్టెన్ షాయ్ హోప్ మెరుపు శతకానికి తోడు రూథర్‌ఫోర్డ్ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో రాణించడంతో రెండో టి20లో వెస్టిండీస్ జట్టు ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హోప్(102నాటౌట్; 45బంతుల్లో 6ఫోర్లు, 9భారీ సిక్సర్లు) శతకంతో మెరిసాడు. మరోవైపు రూథర్‌ఫోర్డ్(84; 37బంతుల్లో 7ఫోర్లు, 7సిక్సర్లు) రాణించి 120పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో విండీస్ టి20ల్లో తొలి, ఈ ఫార్మాట్‌లో రెండో భారీ లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా రికార్డుల్లోకెక్కింది. తొలుత కిమన్ పూరన్(4), హెట్‌మైర్(0), రువాన్ పావెల్(24) నిరాశపరిచినా.. హోప్, రూథర్‌ఫోర్డ్‌కి తోడు షెఫర్డ్(34నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. టీమిండియా బౌలర్లు మయాంక్ యాదవ్‌కు మూడు వికెట్లు లభించారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఓపెనర్ సంజు శాంసన్(82; 41బంతుల్లో 9ఫోర్లు, 4సిక్సర్లు)కి తోడు ఇషాన్ కిషన్(20) తొలి వికెట్‌కు 72పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఓపెనర్ సంజూ శాంసన్ మెరుపు ఆరంభాన్ని కొనసాగిస్తూ.. మిడిలార్డర్ బ్యాటర్లు ఎడాపెడా దంచేశారు. అయ్యర్, తిలక్ వర్మ చివరి 4ఓవర్లు 72పరుగులు రాబట్టడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్(43), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(40)లు వెస్టిండీస్ బౌలర్లను చితక్కొట్టారు. డెత్ ఓవర్లలో తిలక్ వర్మ(44 నాటౌట్) సిక్సర్లతో హోరెత్తించాడు. సంజూ, ఇషాన్‌ల దూకుడుతో పవర్ ప్లేలో విండీస్‌పై రికార్డు స్కోర్ చేశారు. ఈ క్రమంలో శాంసన్ 21 బంతుల్లోనే అర్ధ సెంచరీతో చెలరేగాడు. అకీల్ హోసేన్ ఓవర్లో వరసగా 4, 6, 6, 4తో 22 పరుగులు పిండుకున్న సంజూ.. షెపర్డ్ వేసిన ఆరో ఓవర్లో బ్యా?క్ టు బ్యాక్ బౌండరీలతో అర్ధ శతకం సాధించాడు. దాంతో పవర్ ప్లేలో 79 రన్స్ చేసింది ఇండియా. ఫలితంగా ఈ ఫార్మాట వెస్టిండీస్‌పై గతంలో అత్యధిక స్కోర్‌గా ఉన్న 72 పరుగుల రికార్డు బద్ధలైంది. అభిషేక్ శర్మ(20) ఔటయ్యాక దూకుడు పెంచిన సంజూకు ఇషాన్ కిషన్(43) అగ్నికి వాయువులా తోడయ్యాడు. దంచికొడుతున్న ఇషాన్‌ను ఔట్ చేసిన రోస్టన్ ఛేజ్(3/24)..ఆ తర్వాతి ఓవర్లో శివం దూబే(7)ను పెవిలియన్ చేర్చాడు. కానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(40), తిలక్ వర్మ(44 నాటౌట్) పిడుగల్లే విండీస్ బౌలర్లపై పడ్డారు. దాంతో.. డెత్ ఓవర్లలో వీరి వీరకొట్టుడుకు విండీస్ బౌలర్లు బలవ్వగా.. ఏకంగా 80 రన్స్ వచ్చాయి. వెస్టిండీస్ బౌలర్లు ఛేస్‌కు మూడు, స్ప్రింగర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షాయ్ హోప్‌కు లభించగా.. మూడో టి20 ఇండోర్ వేదికగా ఆదివారం జరగనుంది.

**స్కోర్‌బోర్డు... :** ఇండియా ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి)మోటీ (బి)ఛేస్ 20, సంజు శాంసన్ (సి)కమిల్ పూరన్ (బి)స్ప్రింగర్ 82, ఇషాన్ కిషన్ (బి)ఛేస్ 43, దూబే (బి)ఛేస్ 7, శ్రేయస్ అయ్యర్ (సి)హెట్‌మైర్ (బి)స్ప్రింగర్ 40, తిలక్ వర్మ (నాటౌట్) 44, నమన్ ధీర్ (నాటౌట్) 4, అదనం 9. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 249పరుగులు.

**వికెట్ల పతనం:** 1/42, 2/139, 3/158, 4/162, 5/245

బౌలింగ్: హెుసైన్ 3-0-46-0, షెఫర్డ్ 3.4-0-47-0, ఛేస్ 4-0-24-3, మోటీ 2-0-21-0, జోసెఫ్ 3-0-39-0, స్ప్రింగర్ 4-0-64-2, రోమన్ 0.2-0-7-0.

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** హోప్ (నాటౌట్) 102, కమిల్ పూరన్ (సి)బిష్ణోయ్ (బి)మయాంక్ యాదవ్ 4, హెట్‌మైర్ (బి)మయాంక్ యాదవ్ 0, రువాన్ పావెల్ (సి)సంజు శాంసన్ (బి)కుల్దీప్ 84, షెఫర్డ్ (నాటౌట్) 34, అదనం 4. (18.3ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) 252పరుగులు.

**వికెట్ల పతనం:** 1/5, 2/5, 3/58, 4/178

**బౌలింగ్:** మయాంక్ 3-0-36-3, అర్ష్‌దీప్ 4-0-45-0, అక్ష?ర్ 3.3-0-63-0, దూబే 2-0-30-0, కుల్దీప్ 4-0-53-0, నమన్ 2-0-25-0.

# ఇన్-సర్వీస్ పీజీ కౌన్సెలింగ్ ద్వారా 322 వైద్యుల పోస్టుల భర్తీ




- **14 వైద్య విభాగాల్లోని ఖాళీ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్..**
- **380 మంది హాజరులిలి**
- **రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో నిర్వహించిన ఇన్–సర్వీస్ పీజీ కౌన్సెలింగ్ ద్వారా 322 మంది వైద్యులు పోస్టులను ఎంపిక చేసుకున్నారు. మొత్తం 14 వైద్య విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 380 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపికైన వారిలో 305 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) పోస్టులకు, 17 మంది డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (డీసీఎస్ఎస్) పోస్టులకు ఎంపికయ్యారు. కౌన్సెలింగ్ వివరాలతో కూడిన నివేదికను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందజేశారు.

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని ఇన్–సర్వీస్ పీజీ వైద్యుల కోసం ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం ఖాళీల్లో 387 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 114 డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, 15 పీజీ లీన్ పోస్టులు ఉన్నాయి.

కౌన్సెలింగ్‌లో ఎంపికైన 322 మందిలో 305 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు, మిగిలిన 17 మంది డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులకు ఎంపికయ్యారు. మరో 16 మంది తమ ఎంపికలను విరమించుకున్నారు. పోస్టులు అందుబాటులో లేని 40 మందిని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు తిరిగి పంపించనున్నారు.

# ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ పనితీరు, ఈ సంస్థ చేపడుతున్న వివిధ సాంకేతిక కార్యకలాపాలు ఆదర్శప్రాయంగా, అనుసరణీయంగా ఉన్నాయని రిజిస్ట్రార్ జనరల్ మరియు సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్ అభినందించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ ఆయనకు స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరు, దాని లక్ష్యాల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ చేపడుతున్న డేటాలేక్, అవేర్, ఆర్టీజీఎస్ సీసీటీవీ360, యూనిఫైడ్ గవర్నెన్స్ డ్యాష్ బోర్డు, మనమిత్ర తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు గురించి విపులీకరించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఒక చోట అనుసంధానం చేసి ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు ద్వారా విశ్లేషించి పాలనను మరింత సరళీకృతం చేయడానికి దోహదపడే పలు రకాల యూస్ కేసెస్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు సంక్లిష్టంగా కాకుండా సరళంగా మారి, ఎలాంటి అంతరాయాలు లేకుండా పౌరులకు సేవలు అందేలా చూస్తున్నట్లు తెలిపారు. అవేర్ విభాగం ద్వారా నిరంతరం వాతావరణ పరిస్థితులను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నామన్నారు. దీనిద్వారా ముందస్తుగానే వాతావరణ మార్పులను పసిగట్టి విపత్తుల నుంచి ప్రజలను, యంత్రాంగాన్ని ముందస్తుగానే అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. వరదలు, తుఫాన్ లాంటి విపత్తుల సమయంలో అవేర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక విశ్లేషణల ద్వారా ప్రాణనష్టం, ఆస్తినష్టాల తీవ్రతను గణనీయంగా తగ్గించగలిగేలా ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో నీటి లభ్యత కూడా రియల్ టైమ్‌లో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. సీసీఎల్ ఏ జాయింట్ సెక్రటరీ టీ.ఎస్. చేతన్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మృత్యుంజయకుమార్ నారాయణ్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న కార్యకలాపాలను కొనియాడారు. ప్రధానంగా డేటాలేక్ ప్రాజెక్టును ఆయన ఆసక్తిగా తిలకించారు. డేటాలేక్ లాంటి ప్రాజెక్టు అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సెన్సెన్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ జె. నివాస్, ఆర్టీజీఎస్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంటు పి. శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో ఘనంగా దసరా వేడుకలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** మంగళగిరి టిప్పర్ల బజార్‌లోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో శుక్రవారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసన్నాంజనేయులు దుర్గాదేవి తొమ్మిది అవతారాల విశిష్టతను వివరిస్తూ, చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఏజీఎం రమేష్ రెడ్డి, ఆర్ అండ్ డీ హెడ్‌లు సింహాద్రి, స్వాతి, మారియా పాట్రిక్, కో–ఆర్డినేటర్లు శశిధర్, రోజారాణి, జయశ్రీ, ఎం. యుగంధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి..

◆ పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్..

**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జూలూరుపాడు మండలం నల్లబండబోరు గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీసర్వే పురోగతి, ఇప్పటి వరకు చేపట్టిన సర్వే వివరాలు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను సర్వే రెవెన్యూ అధికారులు, తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. నల్లబండ బోరు గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 1,426 ఎకరాల భూమి ఉండగా, సుమారు 12.50 కిలోమీటర్ల మేర భూ రీసర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామ సరిహద్దులను నిర్ణయిస్తూ సర్వే ప్రక్రియను కొనసాగుతున్నట్లు తెలిపారు. భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి, భూముల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయడంతోపాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి భూమికి సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అవసరమైన సాంకేతిక పద్ధతులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. భూసరిహద్దుల విషయంలో రైతులకు ఉన్న సందేహాలను క్షేత్ర స్థాయిలోనే నివృత్తి చేయాలని సూచించారు. రీసర్వే పూర్తయిన అనంతరం భూములకు సంబంధించిన రికార్డులు మరింత స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు భూ యాజమాన్యానికి సంబంధించిన సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని రెవెన్యూ సర్వే అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రామంలోని రైతులతో కలెక్టర్ మాట్లాడి భూ రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, వారి భూముల వివరాలు, సాగుచేస్తున్న పంటలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భూక్యా పంతులు తనకు రెండు ఎకరాల భూమి ఉందని అందులో ఒక ఎకరంలో పత్తి, మరో ఎకరంలో మిర్చి సాగు చేస్తున్నట్లు తెలిపారు. తన కుమారులు తనను పట్టించుకోవడం



లేదని, వృద్ధాప్య పింఛన్ కోసం ఎంపిడిఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు రైతు కలెక్టర్‌దృష్టికి తీసుకువచ్చారు. దీనిపైస్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను వెంటనే దరఖాస్తును పరిశీలించి, అర్హత మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, సర్వేయర్, సర్పంచ్ జి.సింధు, రైతులు, సర్వే సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లను కలిసిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద

**రాంగోపాల్ పేట్, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లను మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారద గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఇప్పటివరకు సాధించిన ప్రగతి, తీసుకున్న నిర్ణయాలు, కమిషన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా నలుమూలాలకు తీసుకెళ్లిన తీరు, తీసుకొచ్చిన మార్పులపై గవర్నర్‌కు



ఆమె వివరించారు. రెండవసారి మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎలాంటి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు అనే అంశాలపై గవర్నర్ కి పూర్తిగా వివరించారు.

## ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా పేరపాక దీపక్..

● కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన రిజిస్ట్రార్

**మహబూబ్‌నగర్, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పేరపాక దీపక్ గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన దీపక్‌కు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందనలు, శుభాకాంక్షలు



తెలిపారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు మరింత సులభతరం, పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

# భూగర్భ జలాలను సంరక్షిస్తూ ఆయిల్‌పామ్ సాగు చేయాలి

● ఎల్‌నినో పరిస్థితుల్లో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి..

● కలెక్టర్ డాక్టర్ సత్య శారద..

**నర్సంపేట అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ రైతులు భూగర్భ జలాలు, నీటి వనరులను సంరక్షించుకుంటూ బిందు సేద్యం ద్వారా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు పొందే పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, జిల్లాలో ఎగుమతులకు అవకాశమున్న పంటలను ప్రోత్సహించాలని అన్నారు. గీసుకొండ మండలం కొనేమాకులలోని పీడీఆర్ గార్డెన్స్‌లో గురువారం వరంగల్ జిల్లా ఆయిల్‌పామ్ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటల వైపు వెళ్లకుండా, నీటి పొదుపు పద్ధతులను అవలం బించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ, పెదవేగి, ఏలూరు జిల్లా నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి.ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. ముఖ్యంగా నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పరాగసంపర్క కీటకాల వినియోగం, గెలల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రాజు పోషకాల యాజమాన్యంపై రైతులకు సూచనలు అందించారు. జిల్లా ఉద్యాన అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచడంతో పాటు రైతుల



ఆర్థికాభివృద్ధికి ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉద్యాన అధికారులు రాకేష్, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 400 మంది రైతులు అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

## పుష్కరాల పనులన్నీ పకడ్బందీగా పూర్తి చేయాలి

➤ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా..



**నిర్మల్ అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులన్నింటినీ పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారు లను ఆదేశించారు. గురువారం సాయంత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం ఈవో కార్యాలయంలో పుష్కరాల పనుల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బాసరలో జరుగుతున్న పనుల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పనులను నిరంతరం పర్యవేక్షిం చాలని, గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పార్కింగ్ వంటి సౌకర్యాలన్నీ కల్పించాలని ఆదేశించారు. పుష్కరాల నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఏవైనా ఉంటే, వెంటనే ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారం భించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం విశాలమైన పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అలాగే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, హార్టికల్చర్ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ మిర్యాలగూడలో కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ..



**మిర్యాలగూడ అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలో నిర్వహించిన "సేవ్ డెమోక్రసీ-ఓట్ బచావో-దేశ్ బచావో" కార్యక్రమంలో భాగంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ.. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కు అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, ధీరావత్ స్కైలాబ్ నాయక్, మాజీ టౌన్ ప్రెసిడెంట్ నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరు బాలకృష్ణ, గుడిపాటి నవీన్, వన్ టౌన్ టూ టౌన్ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, మోయిస్, దేశిడి శేఖర్ రెడ్డి, బెజ్జం సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు అహజార్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫుడ్ కమిషన్ ఛైర్మన్, మాజీ మంత్రి తలసానిల ప్రత్యేక పూజలు



**కల్వకుర్తి అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం ఉదయం దర్శించుకున్నారు. తిరుమలకు చేరుకున్న ఇరువురు నేతలు, వీఐపీ విరామ సమయంలో ఆలయం లోకి ప్రవేశించి స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండి తులు ఇరువురికి వేద ఆశీర్వచనాలు అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ, శ్రీవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కరోనా మహమ్మారి తర్వాత భక్తుల రద్దీ పెరుగుతోందని, తిరుమలలో భక్తులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను కోరారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు ఇరువురికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి..

◈ విద్యార్థులు బాగా చదివి సొంత కాళ్లపై నిలబడాలి

◈ కలెక్టర్ బి.చంద్రశేఖర్..

**నల్గొండ అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్గొండ భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించాలన్నా, ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడాలన్నా విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం రాత్రి నల్గొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల ఏ,బీ హాస్టళ్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టాయిలెట్లు, డైనింగ్ హాల్, కిచెన్, స్టోర్ రూమ్, తరగతి గదులు, డార్మెటరీలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌లో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో తాగునీటి సమస్యను విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హాస్టల్ ఆవరణలో పలు ప్రాంతాలు చీకటిగా ఉండటాన్ని కలెక్టర్ గమనించారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి హాస్టల్ ఆవరణలో అన్ని వైపులా అవసరమైనన్ని లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రేయర్ సమయంలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాలని, పోటీ





ప్రపంచంలో కంప్యూటర్‌పై అవగాహన లేకుంటే రాణించడం కష్టమవుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో కంప్యూటర్ నేర్చుకోవడం ప్రతి ఒక్కరికీ తప్పనిసరైందని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు పొందాలన్నా, ఆర్థికంగా స్వయం ఆధారితంగా ఎదగాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు బాగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు చదువుకునే సమయంలో శ్రద్ధగా చదువుకోకపోతే జీవితంలో విలువైన సమయం వృథా అవుతుందని అన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం తరపున కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో ఏర్పాటు చేసిన శానిటేషన్, ఫుడ్ తదితర కమిటీల పనితీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ్ వివరాలు వెల్లడిస్తూ.. ఏ హాస్టల్‌లో సుమారు 200 మంది, బీ హాస్టల్‌లో 200 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని తెలిపారు. డిగ్రీ, బీఈడీ, బీటెక్, పీజీ, ఐటీఐ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ హాస్టళ్లలో ఉంటున్నారని వివరించారు. కొందరు విద్యార్థులను కలెక్టర్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ తదితర అంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ప్రతి తరగతి గదిలో, డార్మెటరీలో ఫ్యాన్లు, లైట్లు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కాలం చెల్లిన వంట సరుకులను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించవద్దని వార్డెన్లకు స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం నడుం బిగించాలి



● తన గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్...

**ఖమ్మం అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** రాబోయే పట్ట భద్రుల ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం ప్రణాళికాబద్ధంగా కష్టపడి పని చేయాలని మాజీ రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పార్టీ శ్రేణు లకు పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన పార్టీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో దాదాపు ప్రస్తుతం 28,500ఓట్లు ఉన్నాయని, ప్రతి 100ఓట్లకు ఒక సమన్వయ కర్త చొప్పున అదనంగా 325మందికి బాధ్యతలు అప్పగించామని తెలిపారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుం బ సర్వే తరహాలోనే ఈసారి కూడా ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన పట్టభద్రుల వివరాలుసేకరించాలన్నారు. డివిజన్ల వారీగా ప్రత్యేకంగా టెంట్లు, గుడారాలు, లేదాపార్టీ కార్యాలయాల వద్ద ఎన్‌రోల్‌మెంట్ క్యాంపులు ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియను ఉధృతం చేస్తున్నామని చెప్పారు. తానుస్వయంగా వచ్చే నెల రోజుల్లో కనీసం వారానికి రెండురోజులు ఈ కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటారని ప్రకటించారు. ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయ వాదులు, బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లుపూర్తయిన ప్రయివేట్ సంస్థల ఉద్యోగులను గుర్తించి ప్రత్యక్షంగా కలిసి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. గతంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లోఉమ్మడి ఖమ్మం జిల్లా ముఖ్యంగా ఖమ్మం నియోజకవర్గం నుంచే అత్యధికంగా గ్రాడ్యు యేట్ ఓట్లు నమోదు చేయించి విజయంలో కీలకపాత్ర పోషించామని గుర్తుచేశారు. ఇదే ఉత్సాహంతో ఈసారికూడా పని చేయాలన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో రాబోయే కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలకు నాంది అని ఈఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించే విజయం రాష్ట్రంలో సరికొత్త రాజకీయ ట్రెండ్‌కుశ్రీకారం చుడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసమావేశంలో కృష్ణ, విజయ్‌కుమార్, నాగరాజు, కృష్ణ, మక్బుల్,వీరభద్రం, కోటేశ్వర రావు, జ్యోతిరెడ్డి, పల్లా రోజ్లీనా, కమల, శ్రీను, వెంకటేశ్వర్లు, ప్రశాంతిజస్వంత్, రామ్మోహన్, రామారావు, నాగేశ్వరరావు, శ్రీశైలం, వెంకటేశ్వరరావు,పాషా, మురళీ, వీరునాయక్, కోటేశ్వర రావు, రవి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, రామారావు, ప్రదీప్, సర్పంచులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి





**హైదరాబాద్, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**

విద్యార్థి దశ వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తుకు బలమైన పునాది వంటిదని తెలంగాణ స్టేట్ పోలీస్ కంప్లయింట్ అథారిటీ సభ్యులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. బర్కత్‌పురలోని హైందవి డిగ్రీ కళాశాలలో 'ఫ్రెషర్స్ వెల్కమ్ కార్నివాల్' మరియు 'గ్రాడ్యుయేషన్ డే -2026' వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హైందవి విద్యా సంస్థల ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నిరంతర శ్రమ, దృఢ సంకల్పంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని చెప్పారు. విద్యతో పాటు సామాజిక బాధ్యత, చట్టాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండటం అవసరమని అన్నారు. అనంతరం, నూతనంగా కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలకడంతో పాటు, కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఆయన ప్రదానం చేశారు. ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లోకి అడుగుపెడుతున్న గ్రాడ్యుయేట్లకు సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ జే. నర్సయ్య శుభాకాంక్షలు తెలిపారు. విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో భాగంగా నూతన విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత, నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలతో వేడుక ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డా.వేము వందనంకు జాతీయ కళా రత్న పురస్కారం



**రాజేంద్రనగర్, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎం వి ఆర్ కల్చరల్ అకాడమీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్యాత్మిక సేవా సంస్థ, ఎల్ సి యి ఎస్ ఫౌండేషన్ వేడుకలలో భవాని కాలని రాజేంద్రనగర్ కి చెందిన శతాధిక పురస్కారాల గ్రహీత గత 50 సంవత్సరాలు పైబడివంద నాటికలు, నాటకాల్లో నటించి, 30పైగా దర్శకత్వం వహించిన రచయిత, నటుడు, దర్శకులు డా వేము వందనం కు ప్రతిష్టాత్మక పురస్కారం జాతీయ కళా రత్న సాహితీ వేత్త, విశ్రాంతి డైరెక్టర్ మైన్స్, డా వి డి రాజగోపాల్, సంగీత సామ్రాట్ శ్రీ చరత్ చంద్రనటసార్వభౌమ శ్రీ పుచ్చా సాంబ శివారెడ్డి, నాటిక కళా రత్న శ్రీ బి వి కాటమరాజు, జూనియర్ షణ్ముఖి శ్రీ వల్లూరి శ్రీహరి రావు, విలక్షణ నటుడు శ్రీ కూకట్ల్పల్లి పోలయ్య, సుమధుర గాయకుల శ్రీ అరవారవీంద్ర బాబుల నుండి అందుకున్నారు. డా వేము కు ఇది 126వ అవార్డని,తనను జాతీయ స్థాయిలో ఎన్నిక చేసినందుకు ఉభయ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డా కె బుచ్చేశ్వర రావు, డా కె రవి బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

## పెండింగ్ అక్రిడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి : టీజేఏ డిమాండ్

**ఖమ్మం, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**



జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఖమ్మంలో జర్నలిస్టులకు కేటాయించిన 23 ఎకరాల భూమిని అర్హులైన జర్నలిస్టులకు వెంటనే పంపిణీ చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (TJA) ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. అలాగే పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను తక్షణమే మంజూరు చేసి అందించాలని కోరుతూ ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డికి టీజేఏ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా టీజేఏ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గతంలో జర్నలిస్టుల కోసం కేటాయించిన 23 ఎకరాల భూమి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, దీనివల్ల జర్నలిస్టులు తమ వృత్తిపరమైన విధులను మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓను టీజేఏ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించి, జర్నలిస్టుల పిల్లలకు విద్యలో 50 శాతం రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం కోసం విద్యా రంగంలో ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని టీజేఏ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీజేఏ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జి. నాగస్వామి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు శంకువార్ ప్రశాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాసిం, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎం.డి. రషీద్, జిల్లా నాయకులు వాసం రాజేంద్ర ప్రసాద్, నల్లమోతు శ్రీనివాసరావు, పవన్ కుమార్, వంశీ,వేంపటి నాయుడు, ఖాజా అబ్దుల్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**ఖమ్మం, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**





ఇండియా కూటమి భారీ నిరసన ర్యాలీ★ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానెస్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన పెవిలియన్ గ్రౌండ్ నుండి డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యమాన్ని ఉద్దేశించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ..దేశంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీ ఏజెంట్ గా మారారని తీవ్రంగా విమర్శించారు. దేశవ్యాప్తంగా ఓట్ల దొంగతనం, ఓటర్ల జాబితా అవకతవకలు, ఈవీఎంలపై అనుమానాలకు ప్రధాన కారణం ఈ కమిషనరే అని అన్నారు. రాహుల్ గాంధీ గారు చెప్పినట్టు ఓటు చోరీకి పాల్పడుతున్న జ్ఞానేష్ కుమార్ ఆ పదవిలో ఉండడానికి అనర్హుడని, తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని రచించిన డా. అంబేద్కర్ విగ్రహం సాక్షిగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి చివరి వరకు పోరాడుతుందని, ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ ముందుంటాయని స్పష్టం చేశారు. పిలిచిన వెంటనే పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ నిరసన ర్యాలీలో ఇండియా కూటమి పార్టీల నాయకులు మాట్లాడుతూ..అర్బన్ జిల్లా అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ – ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ తీరును ఎండగట్టారు.సీపీఐ రాష్ట్ర కార్యదర్శి భాగం హేమంతరావు మాట్లాడుతూ – రాజ్యాంగ సంస్థలను బీజేపీ తన గుప్పిట్లో పెట్టుకుందని, జ్ఞానేష్ కుమార్ ఒక రబ్బర్ స్టాంప్ లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ – ఓట్ల దొంగతనానికి ఎన్నికల కమిషనే సహకరిస్తోందని, వెంటనే జ్ఞానేష్ కుమార్ ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ – అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న కమిషనర్ తీరుపై పోరాటం ఆగదన్నారు.సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు అవునూరి మధు, సీసీఏ రవి మారుతి మాట్లాడుతూ – ఈవీఎంల పై ప్రజలకు నమ్మకం పోయిందని, దీనికి పూర్తి బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషనే వహించాలన్నారు. తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గోపగాని శంకర్ మాట్లాడుతూ – ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమమని, అన్ని పార్టీలు కలిసి పోరాడుతామన్నారు.ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, మంత్రి పొంగులేటి క్యాంపు ఇంచార్జి తుమ్మూరు దయాకర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నరసింహారావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్,రమణ,కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్, వై శ్రీనివాస్, జితేందర్ రెడ్డి, చలం, జానీ మియా, ఏపూరి లతాదేవి, యర్రా బాబు, సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్క శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య మరియు అన్ని పార్టీల జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ ఛైర్మన్లు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ప్రజాస్వామిక వాదులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం మక్తా మహబూబ్‌పేట్ 241 డివిజన్‌లో బతుకమ్మ ఏర్పాట్లు శూన్యం..

**మియాపూర్, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**



మక్తా మహబూబ్‌పేట్ 241 డివిజన్‌లో బతుకమ్మ పండుగ సమీపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి సరైన ఏర్పాట్లు చేయకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బతుకమ్మలు ఆడుకునేందుకు అవసరమైన ప్రదేశాలను సిద్ధం చేయాలని, పారిశుధ్యం, లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.బతుకమ్మ పండుగలో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మక్తా మహబూబ్‌పేట్ 241 డివిజన్‌లో బతుకమ్మ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని కోరుతున్నాము. ప్రజల ఫిర్యాదులను ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలనీ ప్రజలు కోరారు.

## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిపై లాఠీచార్జ్‌ను ఖండించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించిన నిరసనలో ఎంపీ పాల్గొని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో కలిసి జంతర్‌మంతర్ వైపు వెళ్తున్న సమయంలో పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో రఘురాం రెడ్డి గాయపడినట్లు మంత్రి పేర్కొన్నారు.ప్రజా ప్రతినిధిపై ఈ విధంగా లాఠీచార్జ్ చేయడం బాధాకరమన్నారు. ఓటు హక్కు అంశంపై ప్రతిపక్షాలు చేపట్టిన పోరును అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఈమేరకు గురువారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు.

## మాటేటి వేణుగోపాల్‌కు పితృవియోగం

### - మాజీ ఎంపీ నామ పరామర్శ

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :**



నమస్తే తెలంగాణ బ్యూరో, మాటేటి వేణుగోపాల్ తండ్రి రామారావు అనారోగ్యంతో పరమపదించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఫోన్‌లో మాటేటి వేణుగోపాల్‌తో మాట్లాడి పరామర్శించారు. రామారావు ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని నామ ప్రార్థించారు.

## ఖమ్మం జిల్లాలో ఘనంగా జోష్ టీబీ ముక్త్ భారత్ అభియాన్' ప్రారంభం

### : జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ నివేదిత




**ఖమ్మం, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ వ్యాప్తంగా క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా చేపట్టిన జోష్ – జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ – టీబీ ముక్త్ భారత్ అభియాన్' ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం ఖమ్మం కలెక్టరేట్ ప్రగతి సమావేశ మందిరం లో ఘనంగా ప్రారంభించినట్లు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ నివేదిత తెలిపారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణు మాధవ్ రావు, ఎన్ సి సి కల్నల్ సంజయ్ కుమార్ భద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత మాట్లాడుతూ జిల్లాలో టీబీ వ్యాధిని తరిమికొట్టేందుకు వైద్యాఆరోగ్య శాఖ పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా – 110 పంచాయతీలకు సత్కారం జిల్లాలో నిర్దేశిత ప్రమాణాలు పాటించి 'టీబీ ముక్త్ పంచాయతీ' హోదా సాధించిన 110 గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య బృందాలను ఘనంగా సత్కరించి అభినందించారు. వ్యాధి లక్షణాలు, ఉచిత వైద్య సేవలు: రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి లేదా కఫంలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక సి బి నాట్ మరియు ట్రూ నాట్ ద్వారా ఖరీదైన నిర్ధారణ పరీక్షలు, పూర్తి స్థాయి మందులు ఉచితంగా అందిస్తున్నామని, పోషకాహార సాయం (నిక్షయ్ పోషణ్ యోజన): చికిత్స తీసుకుంటున్న ప్రతి క్షయ రోగికి పౌష్టికాహారం కోసం ప్రభుత్వం 'నిక్షయ్ పోషణ్ యోజన' కింద ప్రతినెలా నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోనే ఆర్థిక సాయం జమ చేస్తుందని, దాతలు కూడా 'నిక్షయ్ మిత్ర'గా మారి రోగులకు పోషకాహార కిట్లను అందించి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. అంతర్–శాఖల సమన్వయం: జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో టీబీ అనుమానితులను గుర్తించి నూరు శాతం చికిత్స పూర్తయ్యేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. యువత, వాలంటీర్ల పాత్ర: సమాజంలో టీబీ పట్ల ఉన్న అపోహలను తొలగించడంలో ఎన్ సి సి క్యాడెట్లు, 'మై భారత్' యూత్ వాలంటీర్లు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం ముగింపులో క్షయ రహిత సమాజ నిర్మాణం కోసం అధికారులు, సిబ్బంది, వాలంటీర్లతో కలిసి టీబీ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు.లక్షణాలు కనిపిస్తే దాచకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ పూర్తిగా నయమవుతుందని డా. నివేదిత స్పష్టం చేశారు. 'టీబీ రహిత ఖమ్మం' సాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ఈ మహాయజ్ఞంలో భాగస్వాములు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రామ్ అధికారులు, ఎం పి డి ఓ లు, ఎన్సిసి అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాసంగిలో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, గణనీయంగా తగ్గిన భూగర్భ జలాలు
- ప్రాజెక్టులు, చెరువుల్లో పరిమిత నీటి నిల్వలు, త్రాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలి
- కాలువల ద్వారా యాసంగి సాగుకు నీటి విడుదలకు అవకాశం లేదు
- వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి
- బోరుబావుల్లోనూ తగ్గిన నీటి లభ్యత, నీటి పొదుపు పద్ధతులు పాటించాలి



**ఖమ్మం, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, అధిక నీటి అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు.

– నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక
జిల్లాలో ఈ ఏడాది వర్షపాతం లోటుగా నమోదవడంతో పాటు ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ఆశించిన స్థాయిలో నిండలేదని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలు పరిమితంగా ఉన్నందున యాసంగిలో సాగునీటి అవసరాలను తీర్చడం సవాలుగా మారే పరిస్థితి ఉందన్నారు. రైతులు తమ వద్ద అందుబాటులో ఉన్న నీటి వనరులను ముందుగానే అంచనా వేసుకుని, ఆ నీటికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

– కాలువ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేయవద్దు
ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నందున యాసంగి పంటలకు కాలువల ద్వారా సాగునీరు విడుదల చేసే అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కాలువ నీరు వస్తుందనే అంచనాతో అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేసి చివరి దశలో నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితి రాకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
ప్రస్తుతం ఉన్న పరిమిత నీటి నిల్వలను భవిష్యత్తులో త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

– వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలకు ప్రాధాన్యత
యాసంగిలో అధిక నీటి అవసరమయ్యే వరి పంట సాగును రైతులు సాధ్యమైనంత వరకు తగ్గించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బోరుబావుల నీటిపై ఆధారపడి విస్తృతంగా వరి సాగు చేయడం వల్ల భూగర్భ జలాలపై మరింత ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. వరి స్థానంలో తక్కువ నీటితో సాగయ్యే పప్పు ధాన్యాలు, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. కంది, పెసర, మినుము, శనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి పంటలను ప్రాంతాలనుకూలంగా, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా ఎంచుకోవాలని తెలిపారు.

– పంటల ఎంపికలో నీటి లభ్యతను అంచనా వేసుకోవాలి
రైతులు యాసంగి పంటలను ఎంపిక చేసుకునే సమయంలో తమ పొలానికి అందుబాటులో ఉన్న నీటి వనరు, బోరు బావి సామర్థ్యం, నీటి నిల్వలు, పంట కాల వ్యవధి, నేల స్వభావం, మార్కెట్‌లో డిమాండ్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పంట పూర్తయ్యే వరకు అవసరమయ్యే నీటి పరిమాణాన్ని ముందుగానే అంచనా వేసుకోకుండా అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని తెలిపారు.

– భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి
గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బోరు బావుల్లో నీటి లభ్యత కూడా గణనీయంగా తగ్గిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే తక్కువగా ఉన్న భూగర్భ జలాలను అధికంగా తోడటం వల్ల వేసవి కాలంలో త్రాగునీటి అవసరాలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. బోరుబావుల నీటిని విచక్షణారహితంగా వినియోగించకుండా, పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగించాలని రైతులకు సూచించారు. నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.

– సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను వినియోగించాలి
తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. పొలాల్లో నీటి వృథాను తగ్గించే పద్ధతులను పాటించాలని, అవసరమైన మేరకు మాత్రమే నీటిని అందించాలని తెలిపారు.

– పంటల మార్పిడితో నేల ఆరోగ్యం, నీటి సంరక్షణ
పప్పుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పంటల మార్పిడి ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. పంటల వైవిధ్యాన్ని పెంచడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే పరిస్థితిని తగ్గించవచ్చన్నారు.

– రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
యాసంగిలో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు వేదికలు, గ్రామ సభలు, రైతు సమావేశాల ద్వారా నీటి లభ్యత, పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.
మండలాల వారీగా నీటి లభ్యతను అంచనా వేసి, దానికి అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామంలో తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

– త్రాగునీటికి అత్యధిక ప్రాధాన్యత
ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిమిత నీటి వనరులను భవిష్యత్తులో త్రాగునీటి అవసరాలకు కూడా వినియోగించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ప్రజల త్రాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

– రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి
యాసంగి సీజన్‌లో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ తమ పొలాలకు, నీటి లభ్యతకు అనుగుణమైన పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అధిక నీటి అవసరమయ్యే వరి వంటి పంటలపై ఆధారపడకుండా పప్పు ధాన్యాలు, పొద్దుతిరుగుడు వంటి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి నీటి చుక్కను సంరక్షిస్తూ, భవిష్యత్తులో సాగునీరు, త్రాగునీటి కొరత తీవ్రతరం కాకుండా రైతులు, ప్రజలు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థి కుటుంబానికి యస్.బి.ఐ.టి. ఆర్థిక చేయూత

**ఖమ్మం, అక్టోబరు 09 (జర్నలిస్ట్ ఫైల్) :**
యస్.బి.ఐ.టి. కళాశాలకు చెందిన పొనుగంటి శ్రీకాంత్ ఆకస్మిక మృతి పట్ల వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ఆర్థిక సహాయంగా రూ॥ 2 లక్షలు కుటుంబ సభ్యులకు గురువారం అందజేసినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఏఐ అండ్ ఎం.ఎల్) విద్యార్థి అయిన పి. శ్రీకాంత్ గత సంవత్సరం నవంబర్‌లో రోడ్ యాక్సిడెంట్‌కు గురై మృతి చెందడం తమను తీవ్రంగా కలిచి వేసిందని, తల్లి దండ్రులకు ఆర్థిక స్వావలంభన నిమిత్తం తమ కళాశాల తరుపున ఈ ఆర్థిక సహాయం అందించినట్లు తద్వార మృతుడి కుటుంబానికి తమ కళాశాల భరోసాను అందించగలదని కృష్ణ ఆశించారు. గత మూడు సంవత్సరాలుగా తమ కళాశాలలోని విద్యార్థుల ఒంటరి తల్లి లేదా తండ్రి, విద్యార్థుల ఆకస్మిక మృతి వంటి కారణాల వలన కుటుంబం అస్తవ్యస్తం కాకుండ కళాశాల తరుపున ఆదుకునే సదుద్దేశంతో 2లక్షల రూపాయలు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంబించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. ఖమ్మం జిల్లా వరద బీభత్సంలో నాయకన్‌గూడెంకు చెందిన విద్యార్థి తల్లి దండ్రులను కోల్పోవడం, తండ్రిని కోల్పోయిన విద్యార్థి వంటి పరిస్థితులలో ఇటువంటి సహాయాన్ని గతంలో అందించినట్లు కళాశాల వైస్‌ఛైర్మన్ కె. శ్రీచైతన్య గుర్తుచేశారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల ప్రమాదవశాత్తు తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు తమ కళాశాల అండగా ఉంటుందని, ఆర్థంతరంగా విద్యకు ఆటంకం కలగకూడదనే సదుద్దేశంతో ఈ



పథకాన్ని అవలంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి. రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి పొనుగంటి శ్రీనుకు గురువారం కళాశాలలో 2లక్షల రూపాయల చెక్‌ను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం



- ప్రతి సమస్యకు నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కారం
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** పోలీస్ సిబ్బంది సంక్షేమానికి గుంటూరు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ సిబ్బంది ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని సిబ్బంది నుంచి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా ప్రతి వినతిని ఎస్పీ స్వయంగా పరిశీలించి, శాఖ నిబంధనలకు అనుగుణంగా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో సామర్థ్యం, నిబద్ధత, ఉత్సాహం మరింత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

బదిలీలు, పదోన్నతులు, ఇతర పరిపాలనా నిర్ణయాలను శాఖ నిబంధనలు, ఖాళీలు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా చేపడతామని ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం మెరుగుపడితే ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించగలమన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## ప్రొద్దుటూరు దసరా మహోత్సవాలకు ఎంపీ అవినాష్ రెడ్డికి ఆహ్వానం



**ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రొద్దుటూరు పట్టణంలో అత్యంత వైభవంగా, ఘనంగా జరగనున్న శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి ని ఆర్యవైశ్య సభ ప్రతినిధులు ఘనంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ప్రొద్దుటూరు ఆర్యవైశ్య సభ కమిటీ నాయకులు ఎంపీని నేరుగా కలసి శాలువాతో సత్కరించి, దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ మల్లెంకొండు ప్రతాప్, కమిటీ సభ్యులు మల్లేముల సత్యం, బచ్చు పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానాన్ని స్వీకరించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రొద్దుటూరులో జరగబోయే దసరా ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు మరియు ఏర్పాట్ల గురించి కమిటీ సభ్యులను ఆరా తీశారు. ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు ప్రత్యేక ప్రాశస్త్యం ఉందన్న ఎంపీ ఈ వేడుకలకు ఖచ్చితంగా హాజరవుతానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు.

## వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడిని ఘనంగా సత్కరించిన పీఆర్‌వింగ్ వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జోగయ్య



**కడప (జర్నలిస్ట్ ఫైల్ ):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైయస్సార్ కడప జిల్లా అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిని ఇటీవల కాలంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైయస్సార్సీపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా నియమితులైన పాతజోగాళ్ళ జోగయ్య తనకు ఇంతటి పదవి రావడానికి కారణకులైన వైఎస్ఆర్సిపి పార్టీ జిల్లా అధ్యక్షులు పోచం రెడ్డి రవీంద్రారెడ్డిని బ్రహ్మంగారిమఠం మండల వైఎస్ఆర్సిపి నాయకులు బి ఎస్ నారాయణరెడ్డి ఎల్లటూరు శివారెడ్డి తిప్పన నాగార్జున నాయుడు చంద్రబాబు రెడ్డి సుదర్శన్ రాయల్ తో తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛములతో కాలువతో ఘనంగా సత్కరించారు .

ఈ సందర్భంగా జోగయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక బాధ్యతాయుతమైన పదవిని నాకు అప్పజెప్పిన మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి కి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి కి మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘు రామి రెడ్డికి మాజీ జెడ్పి చైర్మన్ ముత్యాల రామ గోవిందరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలని తాను నిరంతరం పార్టీ బలోపేతానికి కృషి చేసి 2029 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం రావడానికి కృషి చేస్తానని వారు తెలియజేశారు.

# ఫొటోలకు ఫోజుల కోసం ప్రజలను మభ్యపెట్టకండి

- పీకలవాగు, స్ట్రోమ్ డ్రెయిన్‌కు తేడా తెలియనివాళ్లా మాట్లాడేది
- అభివృద్ధికి కేరాఫ్ గుంటూరు తూర్పు నియోజకవర్గం
- ప్రగతిని అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- రూ.3.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గుంటూరు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాం. ఫొటోలకు ఫోజుల కోసం ప్రజలను మభ్యపెట్టకండి. స్ట్రోమ్ డ్రెయిన్, పీకలవాగుకు తేడా తెలియని వాళ్లా మాట్లాడేది ?. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు ఉంటే చెప్పండి. అంతేగానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించం అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఇజ్రాయిల్ పేట, బసవతారక రామ నగర్, బారాయిమామ్ పంజా, లాలాజాన్ బాషా పార్కు రోడ్డు ప్రాంతాల్లో రూ. 3.70 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా ఈ ప్రాంతాల్లో కనీసం రోడ్లు కూడా నిర్మించిన దాఖలాలు లేవని తెలిపారు. పేద, మధ్య తరగతి నివసించే ఈ ప్రాంతాల్లో వీధులు ఇరుకుగా ఉండటంతో రోడ్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. ఆరు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదని, ప్రస్తుతం వచ్చిన కాంట్రాక్టర్ ను ఒప్పించి పనులు చేపట్టడం సంతోషంగా ఉందని చెప్పారు. నియోజకవర్గంలో పీకలవాగు ఎక్కడ నుంచి ఎక్కడ వరకు వెళుతుందో కూడా తెలియకుండా ఫొటోలకు ఫోజులిచ్చుకుంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో నియోజకవర్గాన్ని పదేళ్లు వెనక్కి తీసుకెళ్లారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి ఫలాలను అన్ని ప్రాంతాలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని, ప్రజలను గందరగోళానికి దారితీసే అంశాలు తీసుకొస్తూ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వంద కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేశామని అన్నారు.

# ఉన్నత ఆశయాలకు విద్యార్థులకు ప్రేరణ కల్పించాలి



**గుంటూరు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** ఉన్నత ఆశయాల సాధనకు విద్యార్థులకు ప్రేరణ కల్పించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. విద్యా శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శత శాతం ఉండాలని అన్నారు. విద్యార్థులను షైనింగ్ స్టార్ లు, రైసింగ్ స్టార్ లు గా ఇప్పటికే గుర్తించడం జరిగిందని చెప్పారు. రైసింగ్ స్టార్ లు షైనింగ్ స్టార్ లుగా ఎదగాలని స్పష్టం చేశారు. ఇందుకు సరైన ప్రేరణ కల్పించాలని సూచించారు. ఆశయ సాధన పట్ల స్పష్టమైన అవగాహన కల్పించడం వలన స్వయం ప్రేరణ పొందుతారని, తద్వారా మంచి ఫలితాలు అవుతాయన్నారు. ప్రేరణాత్మక కథనాలు తెలియజేయాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ షైనింగ్ స్టార్ హీరోలు కావడానికి ఉపాధ్యాయులు తమ అనుభవాలను ఉపయోగించాలని చెప్పారు. ప్రతీ విద్యార్థి అభ్యసన సూత్రాల్లో వెనుకబడకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థి మానసిక స్థితిని ఉపాధ్యాయులు అంచనా వేసి అందుకు అనుగుణంగా బోధన చేయాలని ఆదేశించారు. విద్యార్థిని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కృతాకృత్యులు కావడంలోనే సంతృప్తి కలుగుతుందని చెప్పారు. ఉన్నత ఆశయాల సాధనకు విలువలతో కూడిన విద్యను అందించాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎవరైనా సాధించగలరనే నమ్మకం కల్పిస్తూ అందుకు ఏ విధంగా సిద్ధం కావాలో తెలియజేయాలని అన్నారు. బడి బయట చిన్నారులు ఉండరాదని స్పష్టం చేశారు. బడి ఈడు గల పిల్లలు బడిలోనే ఉండాలని అన్నారు. అంగన్వాడీ నుండి ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు నుండి ఉన్నత పాఠశాలలు అచ్చట నుండి కళాశాలలు వరకు చేరికలనూ గమనించాలని ఆదేశించారు. మౌలిక వసతుల లోపాలు లేకుండా చూడాలని చెప్పారు. శిథిల భవనాలలో తరగతులు నిర్వహించకుండా పర్యవేక్షణ చేయాలని, అటువంటి భవనాలు ఉంటే నివేదికలు సమర్పించాలని అన్నారు. ఆటిజం కేంద్రాలు అన్ని నెలాఖరుకు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. పి.యం.శ్రీ పాఠశాలల్లో జరిగిన పనులకు బిల్లులు అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.

జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను బ్లూమింగ్ స్టార్ లుగా వర్గీకరణ చేసి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. ఆటిజం కేంద్రాలలో రెండు ఈ నెలాఖరుకు పూర్తి అవుతుందని, ఇప్పటికే రెండు పూర్తి అయ్యాయని చెప్పారు. జిల్లాలో మొత్తం ఐదు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఎనిమిది తరగతి గదులు తొలగించడం జరిగిందని, మరో 84 వరకు గుర్తించడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ఉప విద్యా శాఖ అధికారులు, మండల విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నెల దాటినా వినతిపత్రంపై రెవిన్యూ అధికారులు స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేమిటి ?

- సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్




**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బి.మఠం మండల పరిధిలోని రేకలకుంట కొండల్లో ఎలాంటి అనుమతులు లేకుండా గాలిమరల నిర్మాణాలు చేపడుతున్నారనే అంశంపై రెవిన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించి నెల రోజులు దాటినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం వెనుక ఆంతర్యమేమిటని సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ అన్నారు.

రేకలకుంట కొండల్లో గాలిమరల ఏర్పాటుకు సంబంధించి సంబంధిత కంపెనీకి రెవిన్యూ, అటవీ, పర్యావరణ తదితర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లయితే వెంటనే వాటిని నిలిపివేసి, సంబంధిత కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతిపత్రాలపై అధికారులు వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. నెల రోజులు గడిచినా అధికారులు స్పందించకపోవడం వల్ల అధికారుల తీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. రేకలకుంట కొండల్లో గాలిమరల ఏర్పాటుకు సంబంధించిన అన్ని అనుమతులు, భూమి వివరాలు, నిర్మాణ అనుమతులను అధికారులు పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు తేలితే తక్షణమే పనులు నిలిపివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దుల్లపల్లి ప్రభాకర్ కోరారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై రాష్ట్రస్థాయి చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు

**అమరావతి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన సుపరిపాలన, అభివృద్ధి ప్రస్థానం, దేశ నిర్మాణంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నారు.

ఈ పోటీలు అక్టోబర్ 10న విజయవాడలోని ది వెన్యూ కన్వెన్షన్‌లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరగనున్నాయి. 'సేవా చిత్రలేఖనం', 'వ్యక్తిత్వ పోటీలు' పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత పాల్గొననున్నారు.

చిత్రలేఖనం, వక్తృత్వ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందించనున్నారు. రెండు విభాగాల్లో మొదటి బహుమతిగా రూ. 25 వేలు, రెండో బహుమతిగా రూ. 15 వేలు, మూడో బహుమతిగా రూ. 10 వేలు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన వారికి రూ. 5 వేల చొప్పున అందించనున్నారు. ప్రతి పాల్గొనేవారికి రూ. 1,000 ప్రోత్సాహక బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం, దేశ అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై యువతలో అవగాహన పెంపొందించడం పోటీల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. యువత తమ సృజనాత్మకత, వక్తృత్వ ప్రతిభను ప్రదర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్లు తెలిపారు.

## టీడీపీ మండల అధ్యక్షుడు నల్లబోయిన నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు



- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు

**తెనాలి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ తెనాలి మండల అధ్యక్షుడు నల్లబోయిన నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు శుక్రవారం తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ నల్లబోయిన నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి, ప్రజలకు సేవలందించేందుకు మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని పార్టీ నాయకులు కోరారు.

పదవులు బాధ్యతను పెంచుతాయని, ప్రజాసేవే నాయకుడికి నిజమైన గుర్తింపును తీసుకువస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నాయకులకు కార్యకర్తల అభిమానం, సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణుల మధ్య ఆనందోత్సాహాలతో జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహమ్మద్ కూద్దుస్, జొన్నాదుల మహేష్, అశోక్ వర్ధన, డాక్టర్ శేషగిరిరావు, మలవరపు విజయ్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం జరిగేలా కృషి చేస్తామని శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో తెలిపారు.

ఎన్టీఆర్ హయాంలో 20 శాతం బీసీ రిజర్వేషన్లతో ప్రారంభమైన ప్రస్థానం చంద్రబాబు నాయకత్వంలో 34 శాతానికి చేరిందని ఆమె పేర్కొన్నారు. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం న్యాయపోరాటం చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడం వల్ల సుమారు 16,800 రాజకీయ పదవులకు బీసీలు దూరమయ్యారని ఆమె ఆరోపించారు.

బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని గళ్ళా మాధవి తెలిపారు. న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూనే తదుపరి కార్యాచరణపై కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని, స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు

## దసరా ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ డీసీకి ఆహ్వానం



**బద్వేల్ (జర్నలిస్ట్ ఫైల్ ):** బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం బ్రహ్మంగారిమఠం అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు ఉపాధ్యక్షులు సుంకు చిన్న సిద్ధయ్య సుంకు నాగేశ్వరరావు ఉప కార్యదర్శి అమరావతి బ్రహ్మం ఉప కోశాధికారి ముచ్చర్ల రాధాకృష్ణమూర్తి పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా దసరా పండుగ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి అందజేసి ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా సాదరంగా ఆహ్వానించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న దసరా ఉత్సవాలు విజయవంతంగా జరగాలని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు.

# ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



**గుంటూరు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష ను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పెషల్ టెట్ నిర్వహణపై శుక్రవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షలు ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పరీక్షలు ప్రతి రోజూ రెండు సెషన్లలో జరుగుతాయని అన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 3,398 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. వీరిలో 154 మంది దివ్యాంగులు ఉన్నారని, వీరికి పేరేచర్లలో గల ఇయాన్ డిజిటల్ ఐ.డి.జెడ్ లో కేంద్రం ఏర్పాటు జరుగుతుందని అన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు, వైద్య శిబిరం, పారిశుధ్యం, రవాణా, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్ల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారుజిల్లాలో మేడికొండూరు మండలం పేరేచర్లలో గల ఇయాన్ డిజిటల్ ఐ.డి.జెడ్, వట్టిచెరుకూరు మండలంలో ఉన్న ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కాలేజీ, చేబ్రోలులో ఉన్న ఆర్.వి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ప్రత్తిపాడులో గల మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వట్టిచెరుకూరులో గల మల్లినేని లక్ష్మయ్య విమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్, మల్లినేని పెరుమాళ్ళ ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థులకు అవసరమైన ప్రత్యేక సదుపాయాలు, వైద్య సహాయం అందుబాటులో ఉండాలని అన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరుకుని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ పరీక్షకు హాజరు కావాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సంబంధిత శాఖ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?

అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి

సర్క్యులేషన్ మేనేజర్

76 61 80 59 68

## మంత్రి లోకేష్‌ను కలిసిన యువ చెస్ క్రీడాకారిణి చల్లా నిహారిక



○ ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించడం పట్ల మంత్రి అభినందన

**అమరావతి అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రానికి చెందిన యువ చెస్ క్రీడాకారిణి చల్లా నిహారిక కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను దక్కించుకున్న నిహారికను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఉమెన్ గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా నిహారిక వివరించారు. ఇందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

○ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**పెనుకొండ / శ్రీ సత్యసాయి అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేశామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే, పార్టీపరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు.

టీడీపీ ప్రభుత్వాలు బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచేందుకు చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల 16,800 పదవులను బీసీలు కోల్పోయారని పేర్కొన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన పదవులు దక్కాలన్నదే తమ లక్ష్యమన్నారు.

బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు దాఖలయ్యాయని మంత్రి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తామని, అయితే బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని తెలిపారు. బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, ఎంఎస్ఎంఈ పార్కుల్లో అవకాశాలు కల్పిస్తున్నామని సవిత వెల్లడించారు.

## ప్రతి ఒక్క సమస్యను పరిష్కరిస్తాం



○ కొల్లూరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి విశేష స్పందన

○ వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

**కొల్లూరు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** కొల్లూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పాల్గొని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని పరిశీలించిన నక్కా ఆనంద బాబు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నక్కా ఆనంద బాబు తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, పారదర్శకంగా అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా 'మీకోసం' కార్యక్రమం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆన్‌కాల్ డ్రైవర్లందరికీ ఇన్సూరెన్స్ పాలసీ అమలు చేయాలి

○ ఆన్‌కాల్ డ్రైవర్ జె. శివ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి

**విజయవాడ, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** కాకినాడ డిపోకు చెందిన ఆన్‌కాల్ డ్రైవర్ జె. శివ విధి నిర్వహణలో మృతి చెందిన ఘటనపై ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శివ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే ఆర్థిక సహాయం, తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఆన్‌కాల్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదాలు లేదా ఆకస్మిక మరణాల సమయంలో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి అర్హత మేరకు ప్రభుత్వ, ఆర్టీసీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఆన్‌కాల్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లందరికీ జీవిత, ప్రమాద బీమా పాలసీలు అమలు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రత్యేక పరిహార పథకం ఏర్పాటు చేయడంతో పాటు ఆరోగ్య భద్రత, వైద్య సదుపాయాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు సంక్షేమం కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెనాలిలో ప్రజా దర్బార్ నిర్వహించారు. తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఓపికగా విని, సంబంధిత అంశాలపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడటంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలే ప్రాధాన్యంగా, వాటి పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మహమ్మద్ కూద్దుస్, జొన్నాదుల మహేష్, అశోక్ వర్ధన, మల్లవరపు విజయకుమార్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు పెంచకపోతే స్త్రీశక్తి పథకానికే చెడ్డపేరు



○ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 4 వేల కొత్త బస్సులు, 15 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలి

**తిరుపతి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు, సిబ్బందిని పెంచకపోతే పథకానికే చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. 4 వేల కొత్త బస్సులు సమకూర్చడంతో పాటు 15 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తామని తెలిపారు.

ఆర్టీసీయే విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి, సొంత సిబ్బందితో నిర్వహించాలని కోరారు. విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళం డిపోలను పునఃప్రారంభించాలని, ఉద్యోగ భద్రత సర్క్యులర్ 01/2019ను అమలు చేయాలని, కాలం చెల్లిన టిమ్ యంత్రాల స్థానంలో కొత్తవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్త్రీశక్తి పథకంతో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందిపై పనిభారం పెరిగిందని నాయకులు తెలిపారు. బస్సులు, సిబ్బందిని పెంచి పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సుమారు 500 మంది ఉద్యోగుల పదోన్నతులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



**గుంటూరు, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని ఏపీజీఈఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష కోరారు. సుమారు 20 ఏళ్లుగా వివిధ శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సుమారు 739 మంది ఉపాధ్యాయులు రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నారని, వారికి జూన్, సెప్టెంబర్ 2026 నెలల జీతాలు ఇంకా అందలేదని తెలిపారు. జీతాలు ఆలస్యమైనా రోజుకు సుమారు 12 గంటలు విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.75 లక్షల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని చాంద్ బాష తెలిపారు. ఆగస్టు 2026లో అసెంబ్లీలో చట్ట సవరణ జరిగిన నేపథ్యంలో క్రమబద్ధీకరణపై ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి, అది సాధ్యం కానిపక్షంలో 2026 జూలై 1 నుంచి గ్రాస్ జీతాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజారోగ్యానికి హాని కలిగించవద్దు



○ విస్తృతంగా తనిఖీలు.. తప్పులు చేసే వారిపై కఠిన చర్యలు

○ నిబంధనలు పాటించేందుకు గడువు, శిక్షణ, సహకారం అందిస్తాం

○ హోటళ్ల సంఘాల అవగాహన సమావేశంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆహార భద్రత కమిషనర్ జి. వీరపాండ్యన్

○ తనిఖీల్లో గుర్తించిన లోపాలు, నాణ్యతలేని ముడి సరుకుల వినియోగంపై ప్రజెంటేషన్ ద్వారా వివరించిన ఆహార భద్రత శాఖ డైరెక్టర్ అరుణ్‌బాబు

**విజయవాడ, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడం హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు, ఆహార భద్రత శాఖ అధికారుల ఉమ్మడి బాధ్యత అని ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆహార భద్రత కమిషనర్ జి. వీరపాండ్యన్ అన్నారు. ఆహార పదార్థాల నాణ్యత, ముడి సరుకుల వినియోగం, నిల్వ, వంటగదుల పరిశుభ్రత, తయారీ, వడ్డింపులో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వ్యాపారులను అనవసరంగా వేధించడం శాఖ ఉద్దేశం కాదని, లోపాలను సరిదిద్దుకునేందుకు అవసరమైన గడువు, శిక్షణ, సహకారం అందిస్తామని తెలిపారు. అయితే ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే ఉల్లంఘనలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజమహేంద్రవరం కలుషిత పాల ఘటనను ప్రస్తావిస్తూ చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చని వీరపాండ్యన్ అన్నారు. ఆహార నాణ్యతపై ఫిర్యాదు లేదా అనుమానం వచ్చిన వెంటనే సరఫరాను నిలిపివేసి కారణాన్ని గుర్తించాలని సూచించారు. బియ్యం, పప్పులు, మసాలా దినుసులు వంటి ముడి సరుకులను పరిశుభ్రమైన ప్రదేశాల్లో నిల్వ చేయాలని, ఎలుకలు, బొద్దింకల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత నెలన్నరగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాల్లో తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు.

ఆహార భద్రత చట్టాలు, నిబంధనలు 2011 నుంచే అమల్లో ఉన్నాయని, అవగాహన లేదనే కారణంతో ఉల్లంఘనలను సమర్థించుకోలేరని వీరపాండ్యన్ అన్నారు. పరిస్థితిని బట్టి లోపాల సవరణకు రెండు రోజులు, పది రోజులు లేదా నెల రోజుల వరకు గడువు ఇవ్వడాన్ని పరిశీలిస్తామని తెలిపారు. హోటళ్ల యజమానులు, నిర్వాహకులు, వంట సిబ్బందికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అధికారులు అనవసరంగా వేధించినా, మీడియా పేరుతో బెదిరింపులకు పాల్పడినా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించే హోటళ్లను గుర్తించి ప్రోత్సహించాలని వీరపాండ్యన్ సూచించారు. ఆహార పదార్థాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువీకరణతోపాటు పోషక విలువల వివరాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, ఎఫ్ఎస్ఎస్ఏఐ రూపొందించిన అవగాహన సమాచారాన్ని హోటళ్ల సంఘాలకు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో హోటళ్ల యజమానులు, అధికారులతో సమన్వయ బృందాలు ఏర్పాటు చేసి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

తనిఖీల్లో కృత్రిమ ఆహార రంగులు, నాసిరకం పదార్థాలు, నాణ్యతలేని ముడి సరుకులు, నకిలీ పన్నీర్, అపరిశుభ్రమైన వంటగదులు, ఫ్రీజర్లు, కీటకాల సమస్యలు, నిల్వ గదుల్లో ఎలుకల విసర్జితాలు గుర్తించినట్లు ఆహార భద్రత శాఖ డైరెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శాకాహార, మాంసాహార పదార్థాలకు ఒకే నూనెను ఉపయోగించడం, వండిన ఆహారాన్ని ఎక్కువకాలం నిల్వ చేయడం కూడా నిబంధనలకు విరుద్ధమని వివరించారు. ముడి, వండిన ఆహారాన్ని వేర్వేరుగా నిల్వ చేయాలని, గడువు తేదీలు, ప్యాకింగ్ నాణ్యతను పరిశీలించాలని, వంటగదులు, పాత్రలు, నీటి ట్యాంకులు, నిల్వ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సిబ్బందికి ఏటా వైద్య పరీక్షలు, శిక్షణ నిర్వహించడంతోపాటు శుభ్రమైన దుస్తులు, తల కవర్లు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు.

ఈ సమావేశంలో జాయింట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాసరావు, రాష్ట్రంలోని 28 జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ తదితర సంఘాలకు చెందిన సుమారు 70 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తనిఖీల నేపథ్యంలో కొందరు నకిలీ వ్యక్తులు ఫోన్ చేసి హోటళ్ల నిర్వాహకులను బెదిరిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆహార భద్రత అధికారులను హోటళ్ల సంఘాల ప్రతినిధులకు పరిచయం చేశారు. ఆహార భద్రతపై పరస్పర సమన్వయం, అధికారిక సమాచార మార్పిడికి ఈ సమావేశం వేదికగా నిలిచింది.

నాణ్యమైన ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలకు అందించేందుకు సహకరిస్తామని సంఘాల ప్రతినిధులు తెలిపారు.

# "సాహిత్యం మానవ భావోద్వేగాలకు భాష"





○ సినీ హాస్యనటుడు డాక్టర్ బ్రహ్మానందం

○ ఘనంగా ముగిసిన అమరావతి సాహిత్య ఉత్సవాలు

○ సాహిత్య విలువలపై ప్రసంగించిన డాక్టర్ బ్రహ్మానందం

**అమరావతి, అక్టోబర్ 9 (జర్నలిస్ట్ ఫైల్):** "సాహిత్యం మానవ భావోద్వేగాలకు భాష వంటిది. మన భావాలను అందంగా వ్యక్తీకరించడానికి సాహిత్యం ఒక అద్భుతమైన మార్గం" అని ప్రముఖ సినీ హాస్యనటుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత బ్రహ్మానందం అన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అక్టోబరు 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన అమరావతి లిటరేచర్ ఫెస్ట్ (ఏఎల్ఎఫ్)--2026 ముగింపు వేడుకలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతున్నప్పటికీ, మానవ అనుభవాలను, సాంస్కృతిక జ్ఞాపకాలను, తరతరాల విజ్ఞానాన్ని కథలు, కవిత్వం, ప్రాచీన సాహిత్య గ్రంథాలు శాశ్వతంగా పదిలపరుస్తాయని ఆయన పేర్కొన్నారు.

తెలుగు సాహిత్య సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ వేమన, శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ), ధూర్జటి వంటి ప్రముఖ కవులు, రచయితల రచనలను బ్రహ్మానందం గుర్తుచేశారు. వారి రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తూ, ప్రాసంగికతను కలిగి ఉన్నాయని వివరించారు. సాహిత్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, దానిలోని భావాలను సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తద్వారా విభిన్న నేపథ్యాలకు చెందిన ప్రజలు, వివిధ తరాల వారు సాహిత్యంలోని అంతరార్థాన్ని తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.

సాహిత్యంలో ఆధ్యాత్మికత ప్రాధాన్యాన్ని కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాత్విక, భక్తి సాహిత్య సంప్రదాయాలు ఆత్మపరిశీలనకు, మానవ అస్తిత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

భాగవతం, భగవద్గీత వంటి ప్రాచీన గ్రంథాలు, శాస్త్రీయ కవిత్వం, కథలు, ఇతర సృజనాత్మక ప్రక్రియలు జీవిత పరమార్థం, విలువలు, మానవతా దృక్పథం వంటి అంశాలను అన్వేషించేందుకు విభిన్న మార్గాలను చూపుతాయని వివరించారు. ఈ సాహిత్య సంపదను పరిరక్షించి, అందులోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించడం ఎంతో అవసరమని స్పష్టం చేశారు.

యువతలో పఠనాసక్తిని పెంపొందించాల్సిన ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, సాహిత్యం ఊహాశక్తిని, భావోద్వేగ అవగాహనను, స్వతంత్ర ఆలోచనా ధోరణిని పెంపొందిస్తుందని బ్రహ్మానందం పేర్కొన్నారు. సాహిత్యానికి, సాంకేతికతకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ కంప్యూటర్లు మానవ సామర్థ్యాలను విస్తరిస్తే, సాహిత్యం జ్ఞానానికి మానవీయ కోణాన్ని జోడిస్తుందని అన్నారు. ఇతరుల పట్ల సానుభూతిని పెంపొందించడం, మానవ సంబంధాలను అర్థం చేసుకోవడం, విభిన్న అనుభవాలపై అవగాహన కల్పించడం ద్వారా సాహిత్యం మనిషిని మరింత మానవీయంగా తీర్చిదిద్దుతుందని వివరించారు.

**సాహిత్యాన్ని యువతకు చేరువ చేయడమే లక్ష్యం:-- వీసీ సతీష్ కుమార్** :ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, యువతకు సాహిత్య ప్రపంచాన్ని చేరువ చేయడానికి, విభిన్న భావాలు, సంస్కృతులు, దృక్పథాలతో పరిచయం కల్పించడానికి అమరావతి లిటరేచర్ ఫెస్ట్ ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తోందని అన్నారు. పద్మశ్రీ బ్రహ్మానందం పాల్గొనడం ఈ ఏడాది ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు. సాహిత్యం, కథలు తరతరాల మధ్య అనుసంధానాన్ని ఏర్పరుస్తూ కాలానికి అతీతంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీ ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ విష్ణుపద్, సాహిత్యం మరియు భాషల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ ఠాకూర్, ఏఎల్ఎఫ్--2026 కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్ఘ బసు సంయుక్తంగా మాట్లాడుతూ, వేగంగా మారుతున్న ప్రపంచంలో సాహిత్య ప్రాసంగికతను ఉత్సవాల రెండో సంచిక మరోసారి చాటిచెప్పిందని తెలిపారు. రచయితలు, పరిశోధకులు, పాఠకులు, సృజనాత్మక రంగాలకు చెందిన వ్యక్తులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, అర్థవంతమైన చర్చలకు, భావ వినిమయానికి ఈ ఉత్సవం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు.

**వివిధ రంగాల ప్రముఖులతో ఆసక్తికర చర్చలు**

"మారుతున్న ప్రపంచానికి కథలు" అనే ఇతివృత్తంతో అక్టోబరు 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన అమరావతి లిటరేచర్ ఫెస్ట్-2026ను ఎస్ఆర్ఎం యూనివర్సిటీ-ఏపీకి చెందిన ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ (ఈఎస్ఎల్ఏ) నిర్వహించింది.

ముగింపు రోజు ప్రముఖ రచయిత్రి, వక్త రూపా పై, రచయిత్రి, గ్రాఫిక్ స్టోరీటెల్లర్, విద్యావేత్త సంహిత ఆర్ని, సైన్స్ జర్నలిస్ట్, రచయిత దినేశ్ సి. శర్మ, పుస్తకాలపై సమీక్షలు, విశ్లేషణలు అందించే సురుచి గార్గ్, సాహిత్య కంటెంట్ క్రియేటర్ అమిత్ భారతి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పఠనాసక్తి, సృజనాత్మక వ్యక్తీకరణ, కథలకు సమాజంతో ఉన్న సంబంధం, మారుతున్న కాలంలో సాహిత్యం పోషిస్తున్న పాత్ర వంటి అంశాలపై వారు ఆసక్తికరమైన చర్చలు నిర్వహించారు.

అదే రోజు కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థుల కోసం స్నిగ్ధ భాస్వతి నిర్వహించిన 'ప్రహేళిక' క్విజ్ పోటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా యువత విజ్ఞానాన్ని, విభిన్న అంశాలపై తమ అవగాహనను ఆసక్తికరమైన రీతిలో ప్రదర్శించే అవకాశం లభించింది.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ బ్రహ్మానందాన్ని ఉపకులపతి సతీష్ కుమార్ ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మానందం నటించిన పలు చిత్రాలలోని హాస్య సన్నివేశాలను వీడియో రూపంలో ప్రదర్శించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com